సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 24 - ఆదివారం 30 అక్టోబర్, 2016 సంపుటి : 2 సంచిక 5 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

వివరాలు 2లో...



రాయపూడిలో ఇటలీ డాక్టర్ల వైద్య శిబిరం

వివరాలు 3లో...



చదువుల సరస్వతి కోటేశ్వరమ్మ

వివరాలు 4లో...



జబ్బులు రాకుండా ఎలా కాపాడుకుంటుంది?

మధ్యతరగతి కుటుంబాలకు శుభవార్త
రూ.15 లక్షల నుంచి 20 లక్షలల్లో
అపార్ట్‌మెంట్ కొనాలనుకుంటే
సంప్రదించండి
96768 44442

## దుర్గమ్మకు 2 లక్షల గాజులతో అలంకారం



**రాజధాని ప్రతినిధి, విజయవాడ:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ఈ నెల 25న గాజులతో అలంకరించనున్నారు. 2/6 సైజుగల రెండు లక్షల గాజులను అమ్మవారి అలంకారం కోసం ఉపయోగించనున్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులను భాగస్వాములను చేసేందుకు విరాళాలు స్వీకరించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. నారింజ, గోధుమ, బంగారు వర్ణం, ఎరుపు రంగుల్లో ఉన్న, చెక్కుడు గాజులను, నగదును మాత్రమే భక్తులను నుంచి స్వీకరిస్తారు. నగదు ఆర్జిత సేవ కౌంటర్లోనూ ఆన్‌లైన్ ద్వారానూ చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 24వ తేదీ వరకు ఈ విరాళాలను స్వీకరిస్తారు. ఇతర సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబరు : 1800 425 90 99లో సంప్రదించాలని సూచించారు.

## సింగపూర్‌తో ఏపీ అవగాహన ఒప్పందం



**రాజధాని ప్రతినిధి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగపూర్ మోనిటరీ అథారిటీతో ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఉండవల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మోనిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఫిన్‌టెక్ సెక్టార్‌లో కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మోనిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ అంగీకారం కుదుర్చుకున్నాయి. సింగపూర్ ఫిన్‌టెక్ స్టార్టప్స్‌కు విశాఖలో ఎక్సలెన్స్ సెంటర్ చేయూత ఇవ్వనున్నట్లు పేర్కొంది. డిజిటల్, మొబైల్ పేమెంట్స్, బ్లాక్ చెయిన్, డిస్టిబ్యూటెడ్‌లెజ్జర్స్, బిగ్‌డేటా, ఫ్లెక్సిబుల్ ప్లాట్‌ఫారమ్స్ అంశాల్లో జాయింట్ ఇన్నోవేషన్ ప్రాజెక్టులు ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో మోనిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ చేయూత ఇస్తుంది.

**సాంకేతికతకు పెద్దపీట**

అత్యాధునిక సాంకేతికతకు తెదేపా ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఏపీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచానికి దశ, దిశ నిర్దేశించే శక్తి సింగపూర్ ఫిన్‌టెక్ స్టార్టప్స్‌కు ఉందన్నారు. విశాఖలో అన్ని రకాల వనరులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, సైబర్ టెక్నాలజీలో అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు అంగీకారం కుదిరందని వెల్లడించారు. రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 6లక్షల మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు.

# ఎవరిని కదిపినా కన్నీళ్లే...

## సచివాలయ ఉద్యోగుల వెతలు



**రాజధాని వార్తలు డెస్క్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుతో విద్యా సంవత్సరం మధ్యలో భార్యాబిడ్డలను, ముదిమిలోని తల్లిదండ్రులను వదిలిన హైదరాబాద్ సచివాలయ ఉద్యోగులు వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. సీనియర్ ఉద్యోగులంతా బీపీ, షుగర్, ఇతర ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్న వారే !... ఇక్కడకు వచ్చిన తర్వాత ఒక్క ఆసుపత్రికూడా వారికి అందుబాటులో లేదు. ఏదైనా సీరియస్ అయితే ఎక్కడికి వెళ్లాలో తెలియదు. ఉదయాన్నే రావడం క్యాంటీన్లలో 30 రూపాయ టిఫిను తింటం, మధ్యాహ్నం రూ. 50 భోజనం చేయడం సాయంత్రం ఈసురోమంటూ వెళ్లటం ఇదీ వారి సంగతి. నిజానికి క్యాంటీన్ ధరలు చాల ఎక్కువగానే ఉన్నాయి. సచివాలయ క్యాంటీన్లో టిఫిన్ రేటు రూ. 20, భోజనం రూ. 30లకు రేట్లు తగ్గించే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఎప్పటికి తగ్గిస్తారో తెలియదు. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణం. ఒక్కొక్కరికీ రూ. 2,500లు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న రెయిన్ ట్రీలో వసతి కల్పించారు. అక్కడి నుంచి సచివాలయానికి చేరుకుంటానికి బస్సు చార్జీలు అదనం. అక్కడ ఉన్నది ఒకే ఒక్క స్టోరు. అది నియమిత సమయంలో మాత్రమే పనిచేస్తుంది. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే కారడవినే తలపిస్తుందని వారు వాపోతున్నారు. కొంతమందికి ఉద్యోగులకు విజయవాడలోని అంబెద్కర్ స్టడీ సర్కిల్‌లో వసతి కల్పించారు. అక్కడ 15 మంది పురుష ఉద్యోగులు ఒక అంతస్తులో, మరో 8 మంది మహిళా ఉద్యోగులు మరో అంతస్తులోనూ వసతి కల్పించారు. వారంతా కేవలం బట్టలు బ్యాగులు పట్టుకొని, ఆఫీసు ఫైళ్లు లారీల్లో సర్దుకొని వచ్చిన వారే... కుటుంబాలన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

నాపేరు పుష్ప (పేరు మార్చాం) నాకు ఇద్దరు పిల్లలు 6, 4 సంవత్సరాలు.. మా వారు సాంఘిక సంక్షేమ శాఖలో చేస్తున్నారు. నేను కాంట్రాక్టు ఉద్యోగిగా ఉన్నాను. ఇద్దరం పిల్లల్ని వదిలేసి వచ్చేశాం. ప్రస్తుతం మా పిల్లల వద్ద మా అత్తమామలు ఉంటున్నారు. మేము ఇక్కడికి వచ్చిన తర్వాత పెద్దమ్మాయి పర్యాలేదుకాని, చిన్నమ్మాయి మా బెడ్‌రూంలో కూర్చొని మౌనంగా ఉంటోంది. ఎవరితో మాట్లాడదు, ఏమీ తినదు. ఇదీ పరిస్థితి... దీంతో తెనాలిలోని మా అమ్మనాన్న ఆపాపను ఇంటికి తీసుకెళ్లారు. ఇంతవరకు ఇద్దరు పిల్లలు కలిసే ఉండేవారు. ప్రస్తుతం పిల్లలు కూడా విడిపోయారు, శుక్రవారం సాయంత్రం ఆఫీసు నుంచి సరాసరి హైదరాబాద్ బస్సెక్కుతున్నాం. మళ్లీ ఆదివారం రాత్రికి బస్సెక్కి ఆఫీసుకు చేరుకుంటున్నాం. కొంచెం కూడా విశ్రాంతి ఉండటం లేదు.. ఇప్పటికిప్పుడు పిల్లల్ని ఇక్కడికి తేలేము. ఎక్కడ అద్దె ఇల్లు అడిగినా పదిహేను వేలు తక్కువ చెప్పడంలేదు. సచివాలయ చుట్టుపక్కల ప్రాంతం, మంగళగిరిలో ఇళ్లకు చాలా గిరాకీ ఉంది. ఈ అద్దెలతో పిల్లలతో బ్రతకడం కష్టం అంటూవాపోయారు. గుంటూరు లేదా విజయవాడ లోని నిర్ణీత ప్రదేశాల నుంచి సచివాలయానికి చేరుకోవడానికి , భోజన ఖర్చులు రోజుకు రూ. 300 వరకు అవుతుందన్నారు. బస్ పాస్‌ల విషయానికి వస్తే విజయవాడ నుంచి పెనుమాక వరకు మాత్రమే ఆర్టీసీ పాస్ లభ్యమవుతుందని ఆర్టీసీ అధికారులు తెలపడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలోనే పనిచేస్తున్న మరో సీనియర్ దివ్యాంగ ఉద్యోగి పరిస్థితి మరీ దారుణం...ఆయనకు బీపీ, షుగర్ ఉన్నాయి. ఏ క్షణంలోనైనా హెచ్చుతగ్గులు వచ్చే జబ్బులతో ఎక్కడికి వెళ్లి చికిత్స తీసుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. వాళ్లావిడ ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే... హైదరాబాద్‌లో ఆమె, వెలగపూడిలో ఈయన... నాకేమీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవలమ్మా... పెళ్లవ్వాల్సిన ఇద్దరు ఆడపిల్లలున్నారని ఆయన తరచూ చెబుతుండటం తోటి ఉద్యోగులకు వేధనకు గురిచేస్తుంది . ఆయన ఈ డిసెంబరులో ఉద్యోగ విరమణ చేస్తారు. నిజానికి ఆయన రెండేళ్ల క్రిందటే ఉద్యోగ విరమణ చేయాల్సింది. ఆంధ్రప్రదేశ్‌కు తరలి వచ్చే ఉద్యోగులకు రెండేళ్లు పదవీకాలం పెంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సచివాలయ ఉద్యోగులతోపాటు తరలి వచ్చారు.

తాత్కాలిక సచివాలయానికి వచ్చిన వారిలో మతిస్థిమితంలేని ఉద్యోగి ఒకరున్నారు. ఆయన స్థానంలో చెల్లెలు ఉద్యోగ బాధ్యతలు నెరవేర్చుతారు. ఆయనకు ఆకలి అయితే చెప్పడం తప్ప ఇంకేమీ రాదు. ఆయన వ్యక్తిగత పనులు కూడా చెల్లెలే చేయాలి. నిజానికి ఆయన తెలంగాణ ఉద్యోగి . అయితే సెక్షన్ ఆఫీసర్లకు మాత్రమే ఖాళీలున్నాయని

- మిగతా 2 లో

## ఈవారం రాజధాని

- శత్రుదుర్భేద్యంగా వెలగపూడి సచివాలయం.. గుర్తింపు కార్డులు వుంటేనే ప్రవేశం
- కాపువిద్యార్థులకూ ఉపకార వేతనాలు, డిగ్రీ ఆపై చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.10,000, ఇంటర్‌కు 6000.. కాపు ఉద్యోగ మేళాలో చంద్రబాబు వెల్లడి
- ప్రతి యూనివర్సిటిలో ఏర్పాటు చేయనున్న ఇంకుబేషన్ సెంటర్లు
- సచివాలయ ఉద్యోగులకు బస్‌పాసులు ఇవ్వాలి.. ఉద్యోగుల సంఘం వినతి
- త్వరలో కళాశాలలకు ఉచిత వైఫై
- నెక్కల్లు, మల్కాపురం రైతులకు ప్లాట్లు పంపిణీ చేసిన సీఆర్‌డీఏ అధికారులు
- రాయపూడి నుంచి నూతన రాజధాని అమరావతి వరకు ఎక్స్‌ప్రెస్ రహదారి
- నూతన రాజధాని అమరావతిలో త్వరలో అందుబాటులోకి రానున్న 4జి సేవలు
- కనకదుర్గ వారధి నుండి దొండపాడు వరకు రూ. 600 కోట్లతో 8లైన్ల సీడ్‌యాక్సెస్ రహదారి
- అమరావతిలో మౌళిక సదుపాయాల కల్పనకు రూ. 32,500 కోట్లు





# ట్రిపుల్ తలాఖ్

## దీని కథేంటి?

### ఇస్లాం ధర్మశాస్త్రం ఏం చెబుతోంది ?

ఉమ్మడి పౌరస్మృతి', 'ట్రిపుల్ తలాక్'లకు సంబంధించిన చర్చ మరోసారి ప్రారంభమైంది. నిజానికి ఇది కొత్త చర్చేమీ కాదు. చాలా పాతదే. కాకపోతే అప్పుడప్పుడూ కొంతమంది పెద్దలు తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం దీన్ని వాడుకుంటూ ఉంటారు. అయితే ఈ మూడు తలాక్‌లను గురించి అసలు ఇస్లామ్ ధర్మశాస్త్రం (షరియత్) ఏం చెబుతుందో చూద్దాం.

5లో






# రాజధాని వార్తలు

కలం

## సమృద్ధి – అభివృద్ధి

అభివృద్ధిపై ఊదరగొట్టే ప్రభుత్వాలు, వివిధ సంస్థలు సమృద్ధి గురించి మరచిపోయారు. సమృద్ధి అంటే ఏదీ తక్కువకాకుండా, ఏదీ ఎక్కువ కాకుండా ఉండటం. అభివృద్ధి నిర్వచనం అనంతం. ఎడారుల్లో ఒయాసిస్సులకోసం పరిశ్రమించడం, ఇంకా ఏదో సాధించాలన్న అసంతృప్తి, ఎంత సాధించినా ఏదో మిస్ అయిన భావన. మానవ వికాసానికి తోడ్పడినంతవరకు అభివృద్ధి మంచితే. అయితే అది కేవలం కరెన్సీనోట్ల ఉత్పత్తికి పరిమితమై,మనిషి ఆలోచనా పరిధిని కుంచింపచేసి, మానసిక, శారీరక అనారోగ్యాలకు గురిచేసే అభివృద్ధి నుంచి మనిషి దూరంగా జరగాలి. ప్రకృతి వ్యతిరేకంగా, కాంక్రీటు కీకారణ్యాలను సృష్టిస్తూ మనిషి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న ఈ అభివృద్ధిని, అగ్ర దేశాలు ఎప్పుడో త్యజించాయి. దీన్ని ఎజెండాగా చేసుకొని రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు పనిచేయడం అత్యంత విచారకరం. ఉరుకులు, పరుగులు ఎందుకో, ఎక్కడికో తెలియదు. ఉదయం లేచిన దగ్గర నుంచి ఒకటే ఒత్తిడి టార్గెట్ అందుకోవాలని. జీవించడం ఏమిటో తెలియదు. పరుగెత్తి పాలు తాగడం కంటే నిలబడి నీళ్లు తాగడం మంచిదంటే ఈ తరం వ్యక్తులు పగలబడి నవ్వుతారు. నాలుగేళ్లు నోట్లోకి వెళ్లే పల్లెల్లో ప్రశాంత జీవనం అంటే నవతరం చిరాకు పడుతున్నారు. ఫ్యాక్టరీలు , కార్పొరేట్ సంస్థల్లో కొలువుల కోసం వేలంవెర్రిగా పరిగెత్తి కాలుష్యానికి గురై జబ్బుల పాలవుతున్నారు. అనువుకాని వేళల్లో ఉద్యోగాలు చేసి, శరీరాన్ని కష్టపెడుతూ వారికి వారే హాని చేసుకుంటున్నారు. కార్లు, మేడలు కట్టుకొని శరీరానికి వ్యాయామం లేకుండా మళ్లీ ఉదయాన్నే వాకింగ్‌లు మొదలు పెట్టారు. మనిషి ప్రకృతి బద్ధంగా నడుచుకోవాలిగాని, దానికి వ్యతిరేకంగా నడవకూడదు. సూర్యోదయాన్ని, సంధ్యాసమయాన్ని మనం ఆస్వాదించగలిగి ఉండాలి. జీవితం అంటే అందమైన అనుభవంగా మారిపోవాలి. ఫ్లడ్‌లైట్ల వెలుగులు, కృత్రిమ వెలుగులు కంటికి ఇంపుగా అనిపించవచ్చుగాని, ఆరోగ్యం మాత్రం ఉండదు. ఒక తరం దీనిలో బలైన తర్వాతన్నా దేశంలో సమృద్ధి కలిగిన అభివృద్ధే కావాలని తెలుసుకుంటారేమో...

చక్కని పల్లెల్లో చిన్న ఇంట్లో పాడిపశువులతో, కోళ్లు, ఇంటి ఎదుట ఉన్న కొబ్బరి చెట్లు, దడి చుట్టూ కూర మొక్కలు, ఎవరైనా ఇంటికొస్తే వేపచెట్టుకింద నులకమంచం వేసి, కాళ్లుకడుక్కుంటానికి నీళ్లిచ్చి, కాస్త మజ్జిగ ఇచ్చి, పెరటి కోడిపెట్టిన గుడ్లతో (కోడికూరతో) అప్పటికప్పుడు కూరవండి అతిథికి వడ్డించే వారు. ఆ పలకరింపులు, అతిథి మర్యాదలు బూతద్దంలో చూసినా నేడు కనిపించదు. గుమ్మపాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చటిపొలాలు, పక్షుల కిలకిలారావాలు ఇరుగుపొరుగుతో మాటామంతి, కుటుంబంలోని కలతలుంటే పక్కవారికి చెప్పుకుని ఉపశమనాన్ని పొందటం, కాదంటే పెద్దల దగ్గర ప్రేమపూర్వకమైన రెండు తిట్లు తినడం అదో అనిర్వచనీయమైన జీవితానుభవం. పంటపొలాల్లో బోరు నీటిలో పిల్లల స్నానాలు, పండక్కి పబ్బాలకు అల్లుళ్లు, బంధువులు రాక, దసరా, సంక్రాంతికి అరెసెలు, సంక్రాంతి వచ్చిందంటే పంటలు చేతికొచ్చి కాస్త డబ్బులుంటే కోడిపందాలు వేసి ఆ సరదానే వేరు. నచ్చిన హీరో సినిమా వస్తే ఊర్లోవాళ్లంతా కలసి పట్నంలోని సినిమాకెళ్లి హీరోలను పొగిడి, విలన్ తిట్టి హీరోయిన్ కష్టాలకు కన్నీళ్లు పెట్టుకొని ఏం సరాదా ...ఎంత చెప్పుకున్నా తక్కువే.. ప్రస్తుతం పరుగెత్తి పాలుతాగటం అంటే సరదా..

మనింటికి వచ్చిన వారికోసం మనం వెచ్చించగలిగే సమయం, అతిథికి ఏ సమయంలోనైనా వడ్డించగలిగే ఆతిథ్యమే సమృద్ధి. ఏసమయంలోనైనా కుటుంబసభ్యులకు అందుబాటులో ఉండటమే జీవితం. భార్య, భర్తలు ఉద్యోగాలకు, పిల్లలు కేర్ సెంటర్లకు, కుంటుంబ పెద్దలు వృద్ధాశ్రమాలకు తరలించే ఈ అభివృద్ధి ఎవ్వరికీ అమోదయోగ్యంకాదు. ప్రస్తుతం ఉన్న న్యూక్లియర్ ఫ్యామిలీలు మరీ వ్యక్తిగతంగా మారి మానసిక రోగులు మరింతగా తయారవుతున్నారు. దీనికంతటికీ కారణం పెచ్చరిల్లిన వ్యాపారధోరణి. మాటసాయంకూడా అంగడి సరుకై, మానవత్వం కంటికి కానరానిదై ,పంచభూతాలు తమకే కావాలన్న కార్పొరేట్ ధోరణి. అందుకే పెద్దోళ్లు ఇదివరలో చెప్పేవారు బ్రతుకు–బ్రతకనివ్వుఅని. అది తెలుసుకుంటే మనిషి, లేదంటే 'మనీ' షి గా మిగిలిపోతారు.

## అమరావతి శంఖుస్థాపనకు హైటెక్ ఆహ్వానపత్రిక

గత ఏడాది ఇదే సమయంలో చంద్రబాబునాయుడు నవ్యాంధ్ర ప్రారంభోత్సవ పనులపై బిజీగా ఉన్నారు. ఏపీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తల పెట్టిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి శంకుస్థాపన ఆహ్వాన పత్రికకు ఒక ప్రత్యేకత ఉంది. నాలుగు పేజీల ఈ ఆహ్వాన పత్రికలోని చివరి పేజీలో భవిష్యత్తులో రాజధాని ఎలా ఉండబోతోందో చూపించే గ్రాఫికల్ చిత్రం ఉంది. ఈ గ్రాఫికల్ చిత్రం పైన కుడి వైపున క్యుఆర్ కోడ్ ఎంబ్లమ్ ఉంటుంది.ఇదేవో ఆషామాషీ ఎంబ్లమ్ కాదండోయ్ ! అందులో అమరావతి స్ఫూర్తిని నిక్షిప్తం చేశారు. దీన్ని చూడాలనుకుంటే ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులైతే గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్ళి 'క్విక్ రెస్పాన్స్ కోడ్ రికార్డర్, నే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దాన్ని ఓ పెన్ చేస్తే అందులోని కెమెరా పనిచేయడం మొదలవుతుంది. ఆహ్వానపత్రిక వెనుక పేజీలో ఉన్న క్యూఆర్ కోడ్ ఎంబ్లమ్ మీద, క్విక్ రెస్పాన్స్ కోడ్ రికార్డర్ యాప్ కెమెరాను ఫోకస్ చేయగానే బిప్ మంటూ శబ్దం వినిపిస్తుంది. ఆ తర్వాత ఫోన్ యూట్యూబ్‌కు కనెక్ట్ అవుతుంది. (ఇందుకోసం ఫోన్‌కు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉండాలి ) అక్కడ 'కనెక్ట్ చేయమంటారా! ' అని వచ్చే ప్రశ్నకు ఓకే చెప్పగానే అమరావతి పేరుతో యూట్యూబ్ ఓ పెన్ అవుతుంది. అందులో మూడు వీడియోలు కనిపిస్తాయి. రెండు ఇంగ్లీష్, ఒకటి తెలుగు భాషల్లో ఉంటాయి. ఈ రెండింటిలోనూ అమరావతిలోని ధ్యానబుద్ధను ఏరియల్ వ్యూ ద్వారా చూపిస్తారు. మూడో వీడియోలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకరం సందేశం ఉంటుంది. " మన అమరావతి. మన రాజధాని. అత్యుత్తమ రాజధానిని నిర్మించుకుందాం. వచ్చే శత సహస్ర సంవత్సరాలకు దేదీప్యమానంగా వెలుగొందేలా రాజధానిని నిర్మించుకుందాం. మీతోపాటు మరో ఐదుగురు ట్యాగ్ అవ్వండి. ఆ ఐదుగురు ఒక్కొక్కరూ ఐదుగురి చొప్పున ట్యాగ్ అవ్వాలి. ఇలా ఉద్యమ స్ఫూర్తితో అమరావతి నిర్మాణానికి పునరంకితం కావాలి" అని చెబుతున్న దృశ్యం ఉంటుంది.

– అమరావతి నేడు–నాడు–రేపు అనే పుస్తకం నుంచి
దాసరి ఆళ్వారస్వామి




ఇది మన దగ్గర లేనప్పుడే...
మన స్నేహితులను , మన బంధువులను
మనం అర్థం చేసుకోగలము.

# రాయపూడిలో ఇటలీ డాక్టర్ల వైద్య శిబిరం



ఇటలీ వైద్య బృందం



డాక్టర్లు. సిస్టర్ జైన్, సిస్టర్ సోలీ



మందులతోపాటు పిల్లలకు బొమ్మలనిచ్చి ఆకట్టుకుంటున్న వైద్యబృందం

**రాజధానిప్రతినిధి, రాయపూడి :** హ్యుమటేరియన్ హెల్ఫ్ ఫర్ పూర్ పీపుల్ నేతృత్వంలోని ఇటలీ డాక్టర్లు రాయపూడిలో వైద్య శిబిరం నిర్వహించారు. మేరీమాత డిస్పెన్సరీ డాక్టర్లు. సిస్టర్ జైన్, సోలీ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా రాయపూడి లూర్ధుమాత దేవాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు, వృద్దులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు దుస్తులు, టెడ్డీబేర్‌లు, ఆటబొమ్మలు, రంగురంగుల బెలూన్లు, నోట్‌పుస్తకాలు, స్కెచ్‌పెన్నులు బహూకరించి వారిని ఆకట్టుకున్నారు. ఏడాదికి ఒకసారి ఉండే సెలవులకు భారత దేశం వచ్చి, ఇక్కడి గ్రామీణుల్లో ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నారని డాక్టర్. సిస్టర్ జైన్ తెలిపారు. ఇటలీ డాక్టర్ జార్జ్ నేతృత్వంలో ఐదుగురు డాక్టర్లు ముగ్గురు ఫార్మసిస్టులు, ముగ్గురు అసెస్టెంట్లు గ్రామస్తులకు సేవలు అందించారని డాక్టర్. సిస్టర్ జైన్ తెలిపారు. తుళ్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో వారం రోజులపాటు వైద్యశిబిరాలు నిర్వహించారు.

## నేలపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు

**రాజధాని ప్రతినిధి ,(తుళ్ళూరు) :** రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి. శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. తుళ్ళూరు మండలం నేలపాడు గ్రామంలో రూ.1.15 కోట్ల వ్యయంతో నిర్మించబోయే వివిధ పనులకు ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే రక్షిత మంచినీటి పథకం, మరో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించబోయే సిమెంటురోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన జరిపారు. సీఆర్‌డీఏ నిధులతోపాటు 14వ ఆర్థిక సంఘం నిధులు ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి జరపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచి దనేకుల వెంకట సుబ్బారావు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ వెంకటేశ్వరరావు. డీఈ రాంబాబు, ఏఈ రవికుమార్, పంచాయతీ రాజ్ ఏఈ జోజప్ప, జడ్పీటీసీ సభ్యుడు బెజవాడ నరేంద్రబాబు, ఎంపీపీ వడ్లమూడి పద్మలత, నాయకులు దామినేని శ్రీనివాసరావు, బెల్లం కొండ నరసింహారావు, అనుమోలు సత్యనా రాయణ ధనేకుల రామారావు, పోతురాజు శ్రీనివాసరావు, తరిగోపుల సాంబశివరావు, జొన్నకూటి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## రాజధానికి తగ్గట్టుగా..
## మందడం నూతన పంచాయితీ కార్యాలయ భవనం



నూతనంగా నిర్మించిన మందడం పంచాయితీ కార్యాలయ భవనం

**రాజధాని,ప్రతినిధి–మందడం :** మండలం పరిధిలోని మందడం గ్రామంలో నూతన గ్రామ పరిపాలన భవనం రాజధానికి తగ్గట్టుగా నిర్మించారు.పచ్చని పంట పొలాలతో కృష్ణానదీ తీరానికి సమీపంగా ఉండే మందడం ఆర్థిక పరిపుష్ఠి కలిగిన మండల పరిధిలో ఉన్న మూడు మేజర్ పంచాయితీలలో ఒకటి.తాళ్ళాయపాలెం శివారుగ్రామంగా ఉంది.10వేల పై చిలుకు జనాభా ఉన్న మందడం గ్రామానికి నిన్నమొన్నటి వరకు పంచాయితీ కార్యాలయం భవనంలేదు. గతంలో ఉన్న పంచాయితీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో దానిని పడగొట్టి అద్దె భవనంలో గ్రామపాలన వ్యవహారాలను నిర్వర్తించుకుంటూ వచ్చారు.పొరుగున ఉన్న ఐనవోలు, మల్కాపురం లాంటి మైనర్ పంచాయితీలకు సొగసైన భవనాలుండగా తాము అద్దె భవనంలో విధులు నిర్వర్తించాల్సి రావడం పంచాయితీ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజా ప్రతినిధులు , గ్రామస్థులకు తీవ్ర అసంతృప్తిని కలుగజేసింది.అయితే గత పంచాయితీ ఎన్నికలలో గెలిచి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన ముప్పవరపు పద్మావతి కుమారుడు, ఎం.కె.ఆర్. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముప్పవరపు కృష్ణారావు గ్రామ పరిపాలన భవనం నిర్మాణంపై దృష్టి సారించారు.ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా రాజధానికి తగ్గట్టుగా రూ.లక్షలు వెచ్చించి నూతన పరిపాలన భవనాన్ని నిర్మించారు. గ్రామ సభ నిర్వహణ, సమావేశాలు, పంచాయితీ అధికారులు, సిబ్బంది బాధ్యతలు నిర్వర్తించేందుకు అనువుగా భవన నిర్మాణం జరిగింది.




చంద్రబాబు సమక్షంలో సొంతగూటికి చేరుకున్న ప్రముఖ లాయర్ మొహిద్దీన్ కుడి నుంచి మోదుగుల వేణుగోపాల్ రెడ్డి తదితరులు

## రాయపూడిలో 'దోమలపై దండయాత్ర'




**రాజధాని,ప్రతినిధి–తుళ్ళూరు :** రాజధాని ప్రాంతం, మండల పరిధిలోని రాయపూడిలో దోమలపై దండయాత్ర కార్యక్రమం జరిగింది. స్థానిక శ్రీ కృష్ణదేవరాయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు దోమల నివారణకు సంబంధించి అవగాహన కల్పించే ప్లే కార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ జరిపారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తి నిరోధానికి జరిగే కృషిలో గ్రామస్థులందరూ భాగస్వాములు కావాలని ర్యాలీలో పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పిలుపు ఇచ్చారు.ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెంటపల్లి నాగమణెమ్మ,వైద్యాధికారులు,అంగన్‌వాడీ టీచర్లు, పంచాయితీ సెక్రటరీ వెంకటప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు. కాగా జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే ఆదేశాల మేరకు గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు పలు చర్యలు చేపట్టినట్లు పంచాయితీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య చెప్పారు. గ్రామాన్ని బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా మార్చేందుకు మరుగు దొడ్లు ప్రోత్సహిస్తున్నామన్నారు. దోమల నివారణకు మురుగు నీటి తొలగింపు, కాలవల్లో బ్లీచింగ్, ఫెనాయిల్ చల్లించడం లాంటి కార్యక్రమాలు చేశామన్నారు.

# ఎవరిని కదిపినా కన్నీళ్లే...

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం మిగతావారిని ఆంధ్రాకు తరలించిన వారిలో వీరు కూడా ఉన్నారు. ఊరు కాని ఊరు రోజు రోజూ గంటల కొద్దీ ప్రయాణం, అక్కడైతే మిగతా కుటుంబసభ్యులు సాయం చేసేవారు. ఈ పరిస్థితుల్లో అన్నను తీసుకొని ఆమె రావడం కష్ట సాధ్యంగా మారి విజయవాడ బస్టాండ్‌లో మిగతా ఉద్యోగులతో వేదన పంచుకుంటూ కంటనీరు పెట్టుకోవడం అక్కడ ఉన్నవారిని కదిలించింది. పిల్లలకు క్రెంచ్, ప్లేస్కూల్, ఏటీఎం, డిస్పెన్సరీలను మూడవ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మిస్తామని ప్రభుత్వం తెలిపింది. కాని ఇప్పటి వరకు ప్రారంభం కాకపోవడంతో ఉద్యోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. నెలకు 60 నుంచి 70 వేలు అందుకునే సెక్షన్ ఆఫీసర్లు ఏదైనా చిన్నపాటి ప్లాట్ కొనుక్కుందామనుకుంటే ఒక్కో అపార్టుమెంటు రూ. 70 లక్షలు పలుకుతుండటంతో వారికి నోటమాట రావడం లేదు. నిజానికి ఇంకా ఏడేళ్లపైనే హైదరాబాద్‌పై మనకు హక్కులున్నాయి. ఇంత త్వరగా రావాల్సిన అవసరం ఏముంది ? కనీసం విద్యా సంవత్సరం వరకు కూడా ఎందుకు ప్రభుత్వం ఆగలేకపోయిందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఉద్యోగుల కుటుంబాలన్నీ చెట్టుకొకరు పుట్టకొకరుగా మిగిలిపోయామన్నారు. అత్యాధునిక సచివాలంయం అని ఊదరగొట్టిన మంత్రులను గుర్తు చేసుకుంటూ కార్యాలయ భవనాలుగా కాకుండా, ఇంటి గదుల్లా చిన్న చిన్న గదులు నిర్మించారని, వాష్ రూములు పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు మాత్రమే విజయవాడ ,గుంటూరుల నుంచి సచివాలయానికి బస్సులు వస్తున్నాయి. ఆ తరువాత అవసరమై ఎక్కడికి వెళ్లాలన్నా సాయంత్రం 4.30 వరకు ఒక్క బస్సుకూడా రావడం లేదని మహిళా ఉద్యోగులు వాపోతున్నారు. 5.30కు వచ్చిన బస్సులు ప్రయాణీకులతో కిక్కిరిసి పోయినందువల్ల బస్సు ఎక్కలేకపోయానని, తర్వాత బస్సులు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డానని పుష్ప తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో ఆంధ్రా ఉద్యోగుల సంఖ్య 5,000 మంది, కాగా 3,500 మంది వెలగపూడి సచివాలయానికి చేరుకున్నారు. వీరి రవాణాకోసం బస్సులు, రోడ్లు, రైల్ల మార్గాలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇవన్నీ లేకుండా గ్రామానికి సరిపడే రోడ్లతో, సచివాలయ సిబ్బందిని తరలించడం భావ్యంకాదని వారు ఆవేదన చెందుతున్నారు. తమ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం

**రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి–జిఎన్.రావ్ :** పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవ చేస్తూ సమాజ అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తున్నారని అమలాపురం డిఎస్పి ఎల్.అంకయ్య పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కొబ్బరి వర్తకసంఘ భవనంలో ముమ్మిడివరం పోలీస్ సర్కిల్ పరిధిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని డిఎస్పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చూపిస్తున్న ధైర్య సాహసాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసులు చేస్తున్న కార్యక్రమాల్లో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, అభిమాన సంఘాలు, మానవతావాదులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. సహృదయ ఫౌండేషన్ వైద్యులు జి.కర్నల్‌రాజు, జి.శ్రీహరి, వై.రమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది రక్తాన్ని సేకరించారు. అలాగే అనాతవరం ప్రసిద్ధ, చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, చిరంజీవి అభిమానసంఘాల సభ్యులు, పోలీసులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం సిఐ కెటిటివి రమణారావు, ఎస్ఐలు ఎం.అప్పలనాయుడు, షేక్ జానీబాషా, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 24న గుంటూరులో ముస్లిం షాదీఖానా ప్రారంభోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరు కానున్న మంత్రి పల్లె రఘునాధరెడ్డి

**రాజధాని ప్రతినిధి , గుంటూరు :** అక్టోబరు 24న గుంటూరు టూటౌన్‌లో నూతనంగా నిర్మించిన ముస్లిం షాదీఖానా(ఫంక్షన్ హాలు)ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి పల్లె రఘునాధరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.షాదీఖానా నిర్మాణంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మోదుగుల వేణుగోపాలరెడ్డి చేసిన కృషి అభినందనీయమని పలువురు ముస్లిం నాయకులు పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పల్లె రఘనాధరెడ్డి,ఎమ్మెల్యే మోదుగులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, టి.డి.పి. నాయకులు పాల్గొంటారని వారు చెప్పారు.

## భాదిత కుటుంబానికి రూ.2 లక్షలు అందజేత

**తాళం హనుమంతరావు,ఉండి(రా.వా):** తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను కన్నతల్లిలా ఆదరిస్తుందని ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు గుర్తు చేసారు. మహదేవపట్నంకు చెందిన టిడిపి కార్యకర్త కేతా లక్ష్మన్ మృతి చెందడంతో యువనేత నారా లోకేశ్ ఆద్వర్యంలోనడుస్తున్న ట్రస్ట్ నుంచి రూ2లక్షలు మంజూరైంది. ఆచెక్కునుఉండి ఎమ్మెల్యే శివరామరాజు చేతుల మీదుగా సమావేశంలో భాధిత కుటుంబానికి అందజేసారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జుత్తిగ శ్రీనివాస్, సుజాత, అనంతలక్ష్మి, గంధం బుజ్జి తదితరులు హాజరయ్యారు.




జీనియస్ బుక్ ఆఫ్ అవార్డు అందుకుంటూ...

మహిళా విద్యకోసం.. వారి ప్రగతి కోసం మాంటిస్సోరి విద్యాఉపాధి సంస్థలు స్థాపించిన అభ్యుదయవాది కోటేశ్వరమ్మ. ఆరు దశాబ్దాలుగా నిర్విరామ సేవలందిస్తూ ఆమె వేల మందికి చేయూత నిస్తూ విద్యాదాతగా, ఉపాధి ప్రదాతగా నిలిచారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, మహిళా సాధాకారతా స్ఫూర్తి... మాంటిస్సోరి కోటేశ్వరమ్మ గురించి....



స్పీకర్‌తో కోడెలతో...

# చదువుల సరస్వతి కోటేశ్వరమ్మ

**ఆమె**

**మాం**టిస్సోరి విద్యాసంస్థలు స్థాపించిన అభ్యుదయవాది కోటేశ్వరమ్మ. మాంటిస్సోరి సంస్థల అధినేత్రిగా, ఆరు దశాబ్దాలుగా నిర్విరామ సేవలందిస్తున్న ఆమె వేలాదిమందికి విద్యాదాతగా, ఉపాధి ప్రధాతగా నిలిచారు. కేజీ నుంచి పీజీ స్థాయికి, ఆపై యూనివర్సిటీ స్థాయికి మాంటిస్సోరి విద్యా సంస్థలను చేర్చి ఆమె సమర్ధత, దక్షతల ఏపాటివో తెలుస్తోంది. తండ్రి కోనేరు వెంకయ్య,తల్లి మీనాక్షి, 1925మార్చి 5న కృష్ణాజిల్లా గోసాలలో పుట్టారు. ప్రాధమికవిద్య అంతా ఈడుపుగల్లులో సాగింది. ప్రాథమిక విద్య బిషప్ అజరయ్య పబ్లిక్ స్కూల్ చదివారు. ఇంటర్మీడియట్ కాకినాడలోని పీఆర్ కళాశాలలో, డిగ్రీ గుంటూరు ఏసీ కాలేజీలోచేశారు. రాజమండ్రి ప్రభుత్వ ట్రైనింగ్ కాలేజీలో బీఈడీ, ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ (తెలుగు లిటరేచర్) నాగార్జున యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. చదువులో ఎప్పుడూ చురుగ్గా ఉండే కోటేశ్వరమ్మగారు నెల్లూరు,విజయవాడలో టీచర్‌గా పనిచేశారు. ఉత్తమ టీచర్‌గా నేషనల్‌అవార్డుతో పాటు పలు అవార్డులను అందుకున్నారు.

### మాంటిస్సోరి విద్యాసంస్థల ప్రేరణ

1955కు ముందు బెజవాడలోని ఓ ఇంట్లో ప్రారంభించిన పాఠశాల మూతపడింది. శాస్త్రీయతలేని విద్యావిధానమే ఇందుకు కారణం. వందలాది విద్యార్థుల చదువులు అటకెక్కాయి. ఆ తర్వాత అనివార్యంగా ఆ పాఠశాలను ప్రభుత్వ టీచర్ ఉద్యోగాన్ని వదులుకొని పాఠశాల బాధ్యతలు చేపట్టారు. మాటిస్సోరి విద్యావిధానం అమలుపర్చి తొలిఏడాదిలోనే అద్భుత ఫలితాలు సాధించారు. నర్సరీనుంచి ప్రారంభమైన మాంటిస్సోరి సంస్థల ప్రస్థానం క్రమంగా టెన్త్,ఇంటర్,పీజీ స్థాయికి చేరింది. మహిళలకు ఉపాధి కోర్సుల స్థాపన జరిగింది. యూనివర్సిటీకి కావలసిన్న అర్హతలన్నీ ఈ సంస్థకు ఉన్నాయి. ఇటలీ దేశస్థురాలైన మాంటిస్సోరి ఓ వైద్యురాలు. మాంటిస్సోరి విద్యావిధానానికి ఆమె అద్యురాలు. ఈ పూర్వరంగంలో ఆమె అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. అయినా వెనుకడుగువేయని మాంటిస్సోరి పిల్లలను లోతుగా పరిశోధించి ఈ విద్యా విధానాన్నికనుగొన్నారు.

### అంచలంచెలుగా పైపైకి

1972లో మహిళా జూనియర్ కళాశాల ప్రారంభించారు. 1984లో బీఈడీ కళాశాలే, 1986, 87లో పీజీ విభాగం, 1985లో ఫ్యాషన్ టెక్నాలజీ,1992లో ఎంసీఏ పీజీ,1995లో ఎంసీఏ పీజీ,1997లో మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలను ప్రవేశపెట్టారు. 2004లో నాక్ ఎక్రిడిటేషన్ లభించింది. 2007లో మాంటిస్సోరికి అనుబంధంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, కాలాజ్ ఆఫ్ ఫార్మసీ ఆరంభించారు. 2008లో కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రారంభించి శాస్త్రసాంకేతిక విద్యనుఅందుబాటులోకి తెచ్చారు.

### రచయితగా కోటేశ్వరమ్మ

రాత్రి 9గంటలకు నిద్రపోయి తెల్లవారుజామే లేస్తారు. 50కుపైగా పుస్తకాలను,వందలాది రచనలు అన్నీ ప్రాత:కాలంలో చేసినవే. సంకల్పబలమే అమెను నిత్యనూతనంగా ఉంచుతోంది.కాలాన్ని దైవప్రసాదితంగా భావిస్తారు. ఒక్క క్షణం వృధా చేయడం ఆమెకు ఇష్టం ఉండదు. అన్నికోణాల్లో ఆలోచించి స్థిరచిత్తంతో నిర్ణయం తీసుకుంటారు. సాత్వికాహారం చాలా ఇష్టం. జీవిత భాగస్వామి ఆచార్య వీవీ క్రిష్ణారావును కోల్పోవడం జీవితం లోనేకాదు....ఆయనలోటు తీర్చలేనిదని అంటారు. మాంటిస్సోరి ని బీజ దశనుంచి మహావృక్షంగా మలిచిన మహానుభావుడు ఆయన అంటారు. 90ఏళ్ల వయసులోనే అలుపెరగకుండా విద్యాసం స్థలను నడిపిస్తూ మాంటిస్సోరి కోటేశ్వరమ్మగా గణతికెక్కారు.

## ఎలక్ట్రిక్ బస్సు వచ్చేసింది



భారత్‌లో రూపొందించిన మొట్టమొదటి విద్యుత్తు బస్సు

**అ**శోక్ లేల్యాండ్ సంస్థ 'సర్క్యూట్' పేరిట పూర్తిగా భారత్‌లో రూపొందించిన మొట్టమొదటి విద్యుత్ బస్సును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ బస్సు ఎటువంటి ఉద్గారాలను విడుదల చేయదు. భారతీయ రోడ్లను.... ఇతర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దీనిని తయారు చేశామని సంస్థ తెలిపింది. ఈ సర్క్యూట్ సిరీస్ బస్సును త్వరలోనే అశోక్ లేల్యాండ్ వివిధ విభాగాల్లో కూడా ప్రవేశపెట్టనుంది. లిథియం అయాన్ బ్యాటరీలతో నడిచే ఈ బస్సును ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఏకధాటిగా 120 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దీని చార్జింగ్‌కు దాదాపు మూడు గంటలు పడుతుంది. ఈ బస్సులో అత్యధికంగా గంటకు 75 కిలోమీటర్లు వేగంతో ప్రయాణించవచ్చు. అగ్నిప్రమాదాలను పసిగట్టే వ్యవస్థ, అడ్వాన్స్‌డే టెలీమెటిక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనిలో యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్లు.... ఆన్‌బోర్డ్ వైఫై ఉన్నాయి. ఈ బస్సులో మొత్తం 31 మంది ప్రయాణించవచ్చు.

## పాక్‌ను అడ్డంగా వెనకేసుకొచ్చిన చైనా

**చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హూనా చున్యింగ్**

**బీజింగ్ :** ఉగ్రవాదానికి పాకిస్థాన్ పుట్టినిల్లు అని ప్రధాని నరేంద్రమోడీ బ్రిక్స్ సదస్సుల్లో ప్రకటించినమరువాడే చైనా తన శాశ్వతమిత్రుడు పాకిస్థాన్‌ను అడ్డంగా వెనకేసుకొచ్చింది. ఉగ్రవాదాన్ని ఏ దేశంతోనూ ముడిపెట్టలేమని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించింది. జరిగిన ఐదు దేశాల బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్‌ను ప్రశ్నించగా ఆమె ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదాన్ని ఏ దేశంతోనో, లేదా మతంతోనో ముడిపెట్టలేమని పేర్కొన్నారు. అలాగే ఉగ్రవాదం ఏం రూపంలో ఉన్నా తాము వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా నిరంతర చర్యలద్వారా అన్ని దేశాల్లో సుస్థిరతి సాధ్యమవుతుందన్నారు. ఇగ్రవాదాన్ని ఎదుర్కొవడంలో పాకిస్థాన్ ఎన్నో త్యాగాలు చేసిందని, అంతర్జాతీయ సమాజం వాటిని గుర్తించాలన్నారు. అయితే భారత్, పాకిస్థాన్ రెండూ తమకు పొరుగు దేశాలని, రెండు దేశాలు పరస్పరం చర్చల ద్వారా సమస్యలను శాంతియుతంగా అధిగమించాలని తాము ఆకాంక్షిస్తున్నట్టు ఆమె తెలిపారు.

# రాజధాని గ్రామాలకు శుద్ధ తాగునీరు..

### ఎన్టీఆర్ ట్రస్ట్‌తో ఏపీసీఆర్‌డీఏ ఒప్పందం



**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** అమరావతి రాజధాని నగర పరిధిలోని 29 గ్రామాల్లో ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా శుద్ధిచేసిన తాగునీటిని అందించనున్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌తో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాథికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్,ఎన్టీఆర్ ట్రస్ట్‌సీఈఓ టి విష్ణువర్ధన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లో ప్రజలకు రూ.2 లకే 20 లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు రాజధాని నగర పరిధిలో రెండు నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసి 46 నీటి పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సరఫరా చేయనున్నారు. ఈ ప్లాంట్ల ఏర్పాట్లుచ నిర్వహణకయ్యే వ్యయాన్ని ట్రస్ట్ భరిస్తోంది.నగర పరిధిలో డిజైన్–బిల్డ్–ఫైనాన్స్–ఓన్ – ఆపరేట్– ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) పద్దతిలో బీఐఎస్ ప్రమాణాల ప్రకారం రెండు జతశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ. 1.50కోట్ల వ్యయం కానుంది. ఈ ట్రస్ట్ 2008 నుండి రక్షిత మంచినీటి సరఫరా పథకాల ప్రాజెక్టులను స్వచ్ఛందంగా నిర్వహిస్తోంది.రాష్ట్రంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా రోజుకు 2 లక్షల మందికి మంచినీటిని అందచేస్తోంది.

# నూజివీడు పారిశ్రామికీకరణకు కసరత్తు

- 24 వేల ఎకరాల భూబ్యాంక్
- రైతులకు అధికారుల నోటీసులు

**నూజివీడు :** ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని కృష్ణాజిల్లా నూజివీడు ప్రాంతం పారిశ్రామికీకరణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆ దిశగా భూముల సమీకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. రాజధానికి సమీపంలో ఉండటం,అనువైన జాతీయ రహదారి, విమానాశ్రయం, పోర్టులకు అందుబాటులో ఉండటంతో సింగపూర్, జపాన్ తదితర దేశాల వ్యాపారవేత్తల దృష్టి నూజివీడుపై ఉన్నట్టు విశ్లేషకులు పేర్కొంటున్నారు. పాలకుల ఆదేశాలతో పరిశ్రమలకు కావాల్సిన భూముల సేకరణకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో 24 వేల ఎకరాల భూ బ్యాంకు సిద్ధం చేసినట్లు రెవెన్యూ వర్గాల సమాచారం.నూజివీడు ట్రిపుల్ ఐటీ సమీపంలోని ప్రభుత్వ భూములను మినీ పారిశ్రామికవాడలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు రావడంతో స్థానిక సారథి ఇంజనీరింగ్ పక్కనున్న 1029,1038,1038 సర్వే నంబర్లలోని 32.54 ఎకరాల స్వాధీనానికి చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే అధికారులు 10 మంది రైతులకు తమ భూములను పరిశ్రమలకు ఇవ్వనున్న నేపథ్యంలో వాటిని స్వాధీనం చేయాలని నోటీసులు అందించారు. వీటిని ఏపీఐఐసీకి ఇవ్వనున్నట్లు సమాచారం. నూజివీడు మండలం దేవరగుంట గ్రామ పరిధిలో సుమారు 200 ఎకరాల గట్టుపోరంబోకు భూముల స్వాధీనానికి చర్యలు చేపట్టారు.



ఏపీఐఐసీకి అప్పగించనున్న భూములు

### నీటి వసతుల్లో మొగ్గు

నూజివీడు ప్రాంతాన్ని పారిశ్రామికీకరణకు ఎన్నుకోవడానికి ఇక్కడ భూములతో పాటు నీటి వసతులు అందుబాటులో ఉండటం కారణమనేది అధికారుల వాదన. సాగర్ నీటి కాలువలు ఉండడం, చింతలపూడి వద్ద పోలవరం కాలువపై త్వరలో ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని మంకొల్లు ప్రాజెక్టుకు తరలించి సాగర్ కాలువల ద్వారా నూజివీడుకు మళ్లించే పథకానికి ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేయడం ఇందులో భాగమనే భావిస్తున్నారు.

# మన కోసం

### జనరల్ స్టోర్స్

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మి | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| ఎపి.ఎస్.ఆర్. | తుళ్ళూరు | పురపాటి శ్రీనివాసరావు | 94411 28030 |
| ఖాజా ఖాదార్ | రాయపూడి | షేక్ జానీ | 9948450761 |
| తేజశ్వి | మందడం | నన్నపనేని నరేష్ | 9063631234 |
| దాదా | రాయపూడి | కౌసర్ | 99890 35143 |

### రియల్ ఎస్టేట్

| | | | |
|---|---|---|---|
| శ్రీ సాయిరామ్ | తుళ్ళూరు | పి. పోతురాజు | 9985853188 |
| వంశీకృష్ణ | పెదపరిమి | ఎ.రాము | 9848551688 |
| క్యాపిటల్ | తుళ్ళూరు | వి.వీరాంజనేయులు | 9346229631 |
| నాగార్జున | రాయపూడి | చెరుకూరి బాబి | 7287098458 |
| రియల్‌టర్స్ | రాయపూడి | ఎండి ఆదామ్ | 9441754056 |

### సెలూన్ షాప్

| | | | |
|---|---|---|---|
| వెస్ట్రన్‌లుక్ | పెనుమాక | గోపి | 9908183377 |

### రెస్టారెంట్స్

| | | | |
|---|---|---|---|
| గోదావరి రుచులు | తుళ్ళూరు | యన్.రామరాజు | 9703908055 |
| బిర్యానిస్ | విజయవాడ | ------ | 7032202222 |
| శ్రీ విజయ గణపతి బ్రాహ్మణ | విజయవాడ | కె.లక్ష్మి,గణపతి | 9948462515 |
| అతిధి | వెలగపూడి | సందీప్ | 9441 228460 |
| చినస్వామి రాజధాని | సచివాలయం ప్రాంతం | | 9963441052 |
| శ్రీ దుర్గావిలాస్ | మల్కాపురం | కె.వి.రాజు | 94908 50243 |
| అయ్యప్పభోజనం | వెలగపూడి | | 99084 57372 |

### జ్యూయలర్స్

| | | | |
|---|---|---|---|
| లలిత | తుళ్ళూరు | నాలమాలు మధు | 7905505854 |
| రాజా | తుళ్ళూరు | ప్రభురాజా | 9581500500 |

### షాప్స్

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| రాయల్ ఫర్నిషింగ్స్ | తుళ్ళూరు | కె. సుబ్బారావ | 9492485385 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎస్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| సి .ఓ వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | వెంకట పున్నారావు | 08645-244484 |
| చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| శైవక్షేత్రము | తాళ్ళాయపాలెం | శివస్వామిజీ | 08863297856 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాల . ఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| లాస్య డిజిటల్ స్టూడియో | రాయపూడి | రవికుమార్ | 9491647400 |
| స్టైల్ ఫర్ మెన్ | తుళ్ళూరు | ఎస్.ఎమ్.జాని | 94403 07123 |

### ట్రేడర్స్

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 9908073516 |

### ఎలక్ట్రికల్ వర్క్

| | | | |
|---|---|---|---|
| ఫయాజ్ | రాయపూడి | షేక్. కలాం | 9440521023 |
| న్యూస్టార్ | రాయపూడి | షేక్. ఖాజా | 9553741230 |
| స్టార్ | విజయవాడ | ఎస్.కె.షరీఫ్ | 97038 14862 |
| గ్రీన్ అండ్ కూల్ | తుళ్ళూరు | ఎస్. జాని | 96031 06678 |


## సింగపూర్‌లో దీపావళి 'రైలు'




**సింగపూర్ :** దీపావళి పండుగ అంటే చిన్నా పెద్దా తేడా లేకుండా సంబరాలు జరుపుకొంటారు.దేశ విదేశాల్లోనూ ఈ పండుగకి ఆదరణ ఎక్కువే. ఈనేపథ్యాన్ని పురస్కారించుకుని సింగపూర్‌లో ప్రముఖ మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (ఎమ్మార్టీ ) ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది. ఈ రైలులో భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక అలంకరణ చేశారు. ఇలాంటి రైలును ఏర్పాటు చేయడం సింగపూర్‌లో ఇదే తొలిసారి.అక్టోబరు 15 న ఎమ్మార్టీ ఈ రైలును ఆ దేశ రవాణశాఖ మంత్రి క్వాబూన్ ప్రారంభించారు.దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికులను మరింతగా ఆకర్షించేందుకు ఈ ప్రయోగం చేసింది. ఈ ట్రైన్‌లో భారతీయతను ప్రతిబింబించే ప్రత్యేక అలంకరణ చూసి ప్రయాణికులు ఫిదా అయిపోతున్నారు. ఈ మేరకు లాండ్ ట్రన్స్‌పోర్టు ఆథారిటీ (ఎల్టీఏ) తన ఫేస్‌బుక్ పేజీలో ఇందుకు సంబంధించిన చిత్రాలను పోస్టు చేసింది. నవంబరు మధ్య వరకు ఈ రైలు నార్త్ ఈస్ట్ లైన్‌పై పరుగులు తీయనుంది. రైలే కాదు నార్త్ ఈస్ట్ లైన్, డౌన్‌టౌన్ లైన్ ప్లాట్ ఫారాలు కూడా దీపావళి పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ ప్లాట్ ఫారాలను నిర్వాహకులు ఎంతో అందంగా తీర్చిదిద్దారు. సింగపూర్‌లో పలు చోట్ల ప్రధాన రహదారులు విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతున్నాయి. దీంతో అక్కడ భారతదేశంలో ఉన్న అనుభూతి కలుగుతోన్నట్లు స్థానికులు తెలిపారు. లిటిల్ ఇండియా షాప్‌కీవర్స్ అండ్ హెరిటేజ్ అసోసియేషన్ (ఎల్ఐఎస్‌హెచ్‌ఏ)తో కలిసి పనిచేయడం ద్వారా ఈ ప్రత్యేక రైలు, రహదారులపై ఈ ఏర్పాట్లు చేసినట్లు ఎల్టీఏ తెలిపింది.

# సంక్షేమ సొమ్ముపై సర్కారు కన్ను

- బ్యాంకుల్లో మూలుగుతున్న రూ..19.610.76 కోట్లు
- పీడీ ఖాతాలకు బదలాయించాలని ఆదేశాలు



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** తీవ్ర ఆర్థిక లోటును ఎదుర్కొటున్న రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం విడుదల చేసిన నిధులపై కన్నేసింది. బ్యాంకుల్లో 70,924 ఖాతాల్లో రూ.19,610.76 కోట్లు నెలలుగా మూలుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సహాయంతో నడిచే రాష్ట్ర ప్రణాళికా (సీఏఎస్‌పీ) పథకాల కోసం గతంలో ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేసింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక వనరులను సమీకరించేందుకు ఉన్న అన్ని మార్గాలనూ అన్వేషిస్తోంది. ఈ క్రమంలో బ్యాంకుల్లో మూలుగుతున్న ఈ నిధులపై దృష్టి పడింది. ఆ మొత్తాన్ని పబ్లిక్‌డిపాజిట్ ఖాతాలకు బదలాయించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్రంలోని 12 బ్యాంకుల్లో 70,924 ఖాతాల్లో రూ.19,610.76 కోట్లు మూలుగుతున్నట్లు లెక్కేశారు. ఇవి దాదాపు ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చడానికి సరిపోతాయి. ప్రభుత్వం తీసుకున్న రుణాలపై 7 శాతానికి పైగా వడ్డీని చెల్లిస్తోంది. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం... బ్యాంకుల్లో ఫిక్సడ్,పొదుపు,కరెంట్ ఖాతాల కింద ఉన్న మిగులును డ్రా చేయాలని నిర్ణయించింది. ఆ మొత్తాన్ని పీడీ అధికారులు డ్రా చేసి వాటిని పీడీ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించింది.

### ఆదేశాలు పాటించకుంటే చర్యలు.

ఈ ఆదేశాలను పాటించక పోతే ఏపీ సీసీఏ నిబంధనలు ఉల్లంఘన కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిధుల దుర్వినియోగం జరిగినట్లుగా భావిస్తామని కూడా స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు లేదా మరేదైనా స్పష్టమైన కారణంతో నిధులను డ్రా చేయలేకపోయినట్లయితే.... ఆ విషయాన్ని తెలియజేస్తూ ఆర్థిక శాఖ ఆమోదాన్ని పొందాలని జీఓలో పేర్కొంది. అటువంటి అకౌంట్లను రాష్ట్ర ప్రభుత్వ అంగీకారంతో సేవింగ్ లేదా కరెంట్ ఖాతాలుగా నిర్వహిస్తూ.... రోజువారీ అవసరాల కోసం కనీస మొత్తాలను మాత్రమే అందులో ఉంచుకోవాలని ఆదేశించింది. ఒకవేళ పీడీ అకౌంట్లు లేనట్లయితే కొత్తగా వాటిని తెరవాలని కూడా స్పష్టం చేసింది. ప్రభుత్వం జరిపిన ఒక అధ్యయనంలో... వివిధ సంక్షేమ పథకాల అమలు కోసం విడుదల చేసిన నిధులను ఆయా ఏజెన్సీలు బ్యాంకు ఖాతాల్లో నే ఉంచుతున్నట్లు గుర్తించింది. వాటిని వినియోగించుకునే వరకు అవి అట్టే పడి ఉంటున్నట్లు గమనించింది. కొన్ని కేసుల్లో వాటిని విడుదల వాటిని విడుదల చేసుకునేందుకు ఏజెన్సీలకు అవకాశం లేక ఆ మొత్తాలను ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా బదిలీ చేస్తున్నట్లు గుర్తించింది. ఫలితంగా ఆ నిధులు బ్యాంకుల్లో మూలుగే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలకు ఊరటనిచ్చే అంశం ఏమంటే సర్కారు రాబడి (నిధుల ప్రవాహం), అవసరం (వ్యయం) మధ్య అంతరాలు నిలకడగా తగ్గుతోంది. ప్రస్తుతం ఆ అంతరం రూ.6,403 కోట్లు ఉంది. రూ.1000 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.58,912 కోట్ల రెవెన్యూ రాగా, వ్యయం రూ.65,315 కోట్లకు చేరింది. అప్పుల ద్వారా రూ...20,097 కోట్లను తీసుకోవాలని ప్రభుత్వం భావించగా, అందులో రూ.13,673 కోట్లను ఇప్పటికే సేకరించింది. వార్షిక లోటు రూ.4,868 కోట్లుగా సర్కారు లెక్కకట్టింది. అయితే ఇప్పటికే ఆర్థికలోటు రూ.6,641 కోట్లను చేరింది.

## ఒంగోలు జాతి గిత్తలు రూ.29 లక్షలు



**రాజధాని ప్రతినిధి, హనుమాన్‌జంక్షన్ :** ఒంగోలు జాతి పశువులంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి. అందుకే లక్షల రూపాయలు వెచ్చించి వీటిని సొంతం చేసుకునేందుకు పలువురు పోటీ పడుతుంటారు. బాపులపాడు మండలం వీరవల్లి వాసి చిలకపాటి రాజీవ్‌కు చెందిన ఒంగోలు జాతి గిత్తల జత రూ.29.లక్షలు పలికాయి. గుంటూరు జిల్లా కేశానపల్లిక చెందిన కేశానపల్లి శ్రీనివాసరావు వీటిని కొనుగోలు చేశారు.

# ఆక్వాపై అపోహలొద్దు

**కాలుష్య నివారణకు చర్యలు : సీఎం**

**"ఆక్వాపై విపక్షాలు చేస్తున్న రాద్ధాంతాన్ని నమ్మొద్దు, ఎవరి ప్రయోజనాల కోసమో పశ్చిమ ప్రజల భవిష్యత్‌ను పణంగా పెట్టేదిలేదు. ఆక్వా వల్ల ఎలాంటి నష్టం ఉండదన్న విషయాన్ని ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించాలి."**



**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** కాలుష్య నివారణా చర్యల్ని పటిష్టంగా చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. దేశంలో మరే ప్రాంతానికి లేని రీతిలో పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వాహబ్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ జిల్లాలో పరిశ్రమలకు పెద్దగా అవకాశం లేకపోవడంతో ఆక్వాను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. అయితే దీనివల్ల ప్రచారం జరుగుతున్న స్థాయిలో కాలుష్యం ఉండదని చెప్పారు. నామమాత్రం కాలుష్యం వెదజల్లినప్పటికీ దాన్ని కూడా నివారించే చర్యల్ని పటిష్టంగానే చేపడుతున్నామన్నారు. ఇందుకోసం ప్రపంచంలోనే మేలైన విధానాల్ని ఇక్కడ అమలు చేయనున్నట్లు ఆయన వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో పర్యటన అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ పశ్చిమ ప్రజల పట్ల తనకున్న అవాజ్యమైన ప్రేమాభిమానాల్ని స్పష్టం చేశారు. వారికెలాంటి అన్యాయం జరగనిచ్చే ప్రసక్తేలేదన్నారు. పరిశ్రమల ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. పరిశ్రమలొస్తేనే ఆర్థికాభివృద్ధి చోటు చేసుకుంటుందన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగౌతాయన్నారు. ఆక్వా కూడా ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమగా విస్తరిస్తోందన్నారు. భారత్‌లో సంప్రదాయ వ్యవసాయంతో సమానంగా ఆక్వా పరిశ్రమ ఉపాధి అవకాశాల్ని కల్పించడంతో పాటు ఆదాయాన్ని సమకూరుస్తోందని చెప్పారు. పైగా ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందిందన్నారు. గత రెండు దశాబ్దాల్లో పశ్చిమగోదావరిలో జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు ఆక్వా కూడా ఓ కారణంగా చంద్రబాబు పేర్కొన్నారు. ఇదే జిల్లాలో ఇప్పుడు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఓ వైపు ఆక్వా మరోవైపు పోలవరంతో పశ్చిమ రూపరేఖలే మారిపోతాయన్నారు.త దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుందని చెప్పారు.

ఆక్వాపై విపక్షాలు చేస్తున్న రాద్ధాంతాన్ని నమ్మొద్దంటూ ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరి ప్రయోజనాల కోసమో తాను పశ్చిమ ప్రజల భవిష్యత్‌ను పణంగా పెట్టేదిలేదని పునరుద్ఘాటించారు. ఆక్వా వల్ల ఎలాంటి ఉండదన్న విషయాన్ని ప్రజలకు వివరించాల్సిందిగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించినట్లు తెలిపారు. దీని వల్ల జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఏడుమాసాల్లోగా విజయవాడ-ఏలూరు మధ్యనున్న కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి అధికారుల్ని ఆదేశించారు. పశ్చిమ జిల్లాను కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకుంటాం.. అక్కడికి లొంగని పక్షంలో వాటిని అక్కడ్నుంచి తొలగించాలని ఆదేశిస్తామని చెప్పారు.

# ఆరోగ్యం



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

## చీకటి పడ్డాక తినకుండా ఉంటే

# జబ్బులు రాకుండా ఎలా కాపాడుకుంటుంది?

మన శరీరంలో ఉన్న శక్తి మొత్తంలో సుమారు 25 శాతం శక్తి మాత్రం పగలు, రాత్రులు నిరంతరంగా పనిచేసే అవయవాలైన గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, మెదడు మొదలగు అవయవాలు పనిచేయడానికి ఎప్పుడూ ఉపయోగపడుతూ ఉంటుంది. మనం దినచరులం కాబట్టి పగలు తినడం, తిరగడం అనే రెండు ముఖ్యమైన పనులు చేయాలి. ఈ రెండు పనులు చేయడానికి శరీరంలో మిగిలి ఉన్న 75 శాతం శక్తిలో సుమారు 40 శాతం శక్తి జీర్ణాశయానికి అరిగించడానికి వెళ్లుతుంది. ఆహారం పొట్ట, ప్రేగులలో ఉన్నంత సేపు ఈ శక్తి (40 శాతం) అక్కడే కేంద్రీకరించబడుతుంది. తప్ప మరో కార్యం చేయడానికి కేటాయించబడదు. మనం పగలు ఏదో ఒక పని చేస్తూ ఉంటాము. కాబట్టి ఆ పనిని ఈ శరీరం చేయాలంటే ఎంతో కొంత శక్తి కావాలి. అటు జీర్ణక్రియకు, ఇటు కనీస అవసరాలకు పోగా మిగిలిన 35 శాతం శక్తి మాత్రం మనం పని చేసుకోవడానికి కండరాలకు కేటాయించబడుతుంది. మన అవసరాలను బట్టి ఈ 75 శాతం శక్తి కేటాయించబడుతుంది. ఉదా॥కు ఉదయం పూట స్త్రీలు 9 గంటల వరకు టిఫిన్ కూడా చేయకుండా చక చకా పని చేసుకుంటూ ఉంటారు. '9' గంటలు దాటింది, వ్యర్థపదార్థాలు విడుదలవుతాయి. ఆ వ్యర్థ పదార్థాలను మలాశయం, మూత్రాశయం, చర్మం, ఊపిరితిత్తుల ద్వారా శరీరం శుభ్రం చేసుకోవాలి. ఏ రోజు తయారయిన వ్యర్థ పదార్థాలను ఆ రోజు నిలువ ఉంచుకోకుండా శరీరం లోపల పరిశుభ్రంగా ఉంచుకోవడం కొరకు క్లీనింగ్ పని చేసుకోవాలి. ఆ క్లీనింగ్ డ్యూటీ మనం శరీరానికి రాత్రి ప్రొద్దు "12" గంటల పాటు. మనం ఇంటిని ఏ రోజుకారోజు తుడుచుకున్నట్లే, ఏరోజు గిన్నెలు ఆ రోజు పరిశుభ్రం చేసుకుంటున్నట్లే శరీరం కూడా ప్రతీ రోజు తీసుకోవాలి. మనం ప్రతి రోజూ త్రాగుతాం, గాలి పీల్చుతాం ఏదో ఒకటి తింటాం కదా, ఆ మూడు రూపాలలో ఏవన్నా క్రిములు, వైరస్‌లు, టాక్సిన్స్ లోపలకు వెళితే వాటి నుండి రక్షించు కోవడం, జబ్బుపడ్డ కణాలను రిపేరు చేసుకోవడం, చచ్చిపోయిన కణాల నుండి ఇన్‌ఫెక్షన్ రాకుండా వాటి నుండి రక్షించుకునే రక్షణ కార్యక్రమాన్ని కూడా శరీరం రాత్రంతా నిర్వహించాలి. అంటే, మనం శరీరం పగలు తినడం, తిరగడం అనే రెండు పనులు చేస్తే, రాత్రి పూట మాత్రం క్లీనింగ్, రిపేర్ అనే రెండు ముఖ్యమైనపనులు చెయ్యాలన్నమాట. ఈ రెండు ముఖ్యమైన పనులను శరీరం రాత్రి పూట చేయాలంటే, శరీరానికి ఎంతో శక్తి కావాలి. మనలో పగలు అటు క్లీనింగ్ పనులు రెండూ ఒకేసారి చెయ్యలేరు. పైగా వంట పని అవ్వకుండా శుభ్రం చేస్తే ఇంకా చెత్త పడే అవకాశం ఉంటుంది. కాబట్టి శుభ్రం చేసినా ఉపయోగముండదు. వంటపని పూర్తి అయి పిల్లలు, భర్త వెళ్ళిపోయాక ఏకంగా ఒకేసారి క్లీనింగ్ మొదలెడతారు. ఇంటికి ఏదన్నా చిన్న చిన్న రిపేర్లు లాంటివి వస్తే ఖాళీగా ఉన్నప్పుడు వాటిని మనం చేసుకోవడానికి (ఉదా॥కు స్టౌవ్ రంధ్రాలు పూడితే వాటిని పొడుచుకోవడం, కిటికీలు టైటుగా ఉంటే వాటికి ఆయిల్ వేసుకోవడం) ప్రయత్నిస్తాము. అలాగే మనం శరీరం కూడా ఇదే విధముగా పనిచేస్తుంది. పగలు తినడం, తిరగడం అనే డ్యూటీ చెయ్యాలి కాబట్టి ఈ హడావిడిలో ఉంటుంది. తింటున్న కొద్దీ ఇంకా శరీరంలో ఎంతో కొంత చెత్త తయారవుతూ ఉంటుంది. వంట పని అయ్యాక క్లీనింగ్ ఒకేసారి మొదలెడదాము అని స్త్రీలు అనుకున్నట్లే, మనం తినడం ఆపితే శరీరం క్లీనింగ్ చెయ్యడం, రిపేరు చెయ్యడం మొదలు పెడదామని ఎదురు చూస్తూ ఉంటుంది. మనం తినడం ఆపితే గదా! రాత్రి 10,11 గం॥లకు తిని. ఆపినా, ఆ ఆహారం పొట్టలో పూర్తిగా జీర్ణం అయితేనే రిపేర్లు, క్లీనింగ్ అనేవి ప్రారంభించబడతాయి. రాత్రి 10 గం॥లకు తిన్నది అరగడానికి తెల్లవారు ఝామున 4,5 గంటలవుతుంది. అప్పట్నుండీ రిపేరు, క్లీనింగ్ ప్రారంభమైతే మరలా ఏదన్నాతినే వరకూ జరుగుతూరు ఉంటుంది. సుమారు 7 గంటలకల్లా ఏదన్నా తినడమో, తాగడమో చేస్తాము. దానితో క్లీనింగ్ ఆగిపోతుంది. అంటే సుమారు 2,3 గంటల పాటు మాత్రమే జరుగుచున్నది. రాత్రి 10 గంటలకు ఏ నాన్‌వెజ్ పలావో తిని పడుకుంటే అది అరిగేలోపు తెల్లవారిపోతుంది. ఇక ఆ రోజుకి క్లీనింగ్, రిపేరు చేసుకునే శక్తిలేక, శరీరం ఆ కార్యాన్ని వదిలేస్తుంది. ప్రతి రోజూ రాత్రి, 12 గంటలపాటు క్లీనింగ్, రిపేరు చేసుకోవలసిన శరీరం, అవకాశం లేక రోజుకి 2,3 గంటలలో లేదా మరికొన్ని రోజులైతే పూర్తిగా ఆగిపోవడమో జరుగుచున్నది. ఇలా ఎన్ని రోజులు, ఎన్ని సం॥లుగా జరుగుచున్నదో ఆలోచించండి.


టిఫిన్ తిని పనిచేసుకోవచ్చు గదా అని నా బోటి వారు అంటే, మేము తింటే పనిచేసుకోలేము, అందుకని పనంతా అయ్యాకా తింటాము అని అంటారు. ఇలా ఎందుకంటున్నారో తెలుసా! వారు ఏమీ తినలేదు కాబట్టి వారి జీర్ణకోశానికి వెళ్ళ వలసిన "40" శాతం శక్తి పొదుపుగా ఉండడం వల్ల ఇటు కండరాలకీ కేటాయించబడి చేసే పని చురుగ్గా, శక్తివంతంగా చేసుకునేట్లుగా సహకరిస్తుంది. అందుచేతనే ఏదన్నా తిన్నాక మనం చురుగ్గా పనిచెయ్యలేం. మన శరీరం రాత్రిపూట తినడం, తిరగడం చెయ్యకూడదు కాబట్టి, ఆ రెండు పనులకు కేటాయించబడిన శక్తి సుమారు 75 శాతం పొదుపు అవుతుంది. ఈ శక్తిని పొదుపు చేయడం కొరకే రాత్రికి మనం తినడం, తిరగడం చెయ్యకూడదు. రాత్రి వేళ్లలో ఈ 75 శాతం శక్తిని శరీరం ఇంకొక ఘన కార్యం నిర్వహించడానికి కేటాయించుకుంటుంది. ఆ ఘనకార్యమేమిటో తెలుసుకుందాము.

మనం పగలు తిన్న ఆహారం అరిగి, లోపలకు వెళ్ళి శక్తిగా మారిన తరువాత అనేక పనులు చెయ్యడానికి, ఆహారాన్ని జీర్ణం చెయ్యడానికి ఉపయోగపడిన 75 శాతం శక్తిని, ఆ రెండు పనులు చెయ్యడం ఆపి ముఖ్యమైన పనులు నిర్వహించడానికి ఉపయోగపడుతుంది. క్లీనింగ్, రిపేరు రాత్రి పూట మనలో సవ్యంగా నడవాలంటే మనం వెలుతురుండగానే తేలిగ్గా తిని ఆపితే, ఆ తిన్నది అరిగిన తరువాత నుండి ప్రారంభం అవుతుంది.

ఉదా॥కు ఉదయం పూట ఎవరి ఇల్లు చూచినా చిందర వందరగా, గందరగోళంగా ఉంటుంది. ఎందుకంటే పిల్లల్ని స్కూల్‌కి, భర్తని ఆఫీస్‌కి పంపేహడావిడిలో స్త్రీలు క్లీనింగ్ పని పక్కన బెట్టి ముందు వంట పని మీద దృష్టి పెడతారు. కూరలు కోస్తారు కానీ తొక్కు ప్రక్కనే వదిలేస్తారు. తాలింపులేస్తారు కానీ మూకుడు అక్కడే పడేస్తారు. అన్నం వండేటప్పుడు పొంగి స్టౌవ్ నిండాపడుతుంది. కానీ వదిలేస్తారు, అటూ, ఇటూ పది సార్లు తిరగడం వల్ల వంటగది దుమ్ముగా, రొచ్చుగా ఉంటుంది. అయినా వదిలేస్తారు. ఎందుచేతనంటే ఇటువంటపని,

చెత్తకుండిలో చెత్తను రోజూ పారవేయకుండా 3,4 రోజులు నిలవ ఉంచితే, అందులో వుడే క్రీమీకిటకాదులు పుట్టి ఇంటి వాతావరణం చెడిపోయినట్లుగానే, మనలో కూడా ప్రతి రోజు తిన్న ఆహారం ద్వారా వచ్చిన చెడు ఏ రోజు కారోజు పూర్తిగా బయటకు పోతే అసలు రోగాలే రావు. జంతువులు 12 గంటల పాటు తిని, రాత్రి 12 గంటలపాటు విశ్రాంతి నిచ్చి వాటి ఆరోగ్యాన్ని అవేకాపాడుకుంటున్నాయి. కానీ మన శరీరానికి మాత్రం మనం అవకాశమివ్వకరోగాలను చేతులారా కొని తెచ్చుకుంటున్నాము. పొయ్యిలో పుల్ల పెట్టి మండించామంటే బొగ్గు,బూడిద, పొగ రావడం సహజం. పొయ్యి శుభ్రంగా ఉండాలంటే ఏ రోజుకారోజు పొయ్యిని ఊడ్చుకుని చెత్తని బయట పారబోస్తాం. ఇదే పని మన శరీరంలో కూడా జరగాలి గదా! మనమేమీ శరీరాన్ని లోపల శుభ్రం చేయనవసరం లేదు. నువ్వు కాస్త పెందలకడనే తిని ఆపు నాయనా! నేనే శుభ్రం చేసుకుంటాను అని శరీరం మనల్ని అడుగుతుంది. ఘనం జబ్బులు రాకుండా, లేకుండా బ్రతకడానికి, శరీరానికి ఈ చిన్న అవకాశమిస్తే ఎంచక్కా ఆరోగ్యాన్ని కాపాడుతుందో చూడండి.

## అంతర్జాతీయ ఆతిథ్య కేంద్రంగా అమరావతి



**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** విద్య, వైద్య పారిశ్రామిక మౌలిక రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం ఇప్పుడీ నగరాన్ని అంతర్జాతీయ ఆతిథ్య కేంద్రంగా కూడా మార్చాలని ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇటీవల కాలంలో జపాన్, రష్యా, సింగపూర్ వ్యాపార, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వం ప్రతినిధులు తరచూ అమరావతి కొస్తున్నారు. దీంతో ఈ నగరం అంతర్జాతీయపటంలో ఓ ప్రత్యేకత సంతరించుకోగలిగింది. సింగపూర్, రష్యా, జపాన్‌ల నుంచి బృందాలు తరచూ ఈ ప్రాంతానికొస్తున్నాయి. అక్కడ పెట్టుబడులకు ఇప్పటికే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశాయి. దీంతో అమరావతి ఆతిద్యరంగంలో కూడా అగ్రగామికాగలదని ప్రభుత్వం గుర్తించింది. రాజధాని ప్రాంత సాధికారిత సంస్థ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖతో కలసి అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఆతిద్య రంగసెమినార్‌కు ఏర్పాట్లు చేసింది. ఇది ఇక్కడ జరుగుతుంది. ఇందులో బహుళ జాతీయ సంస్థలకు చెందిన హోటల్ గ్రూప్స్ తాజ్,ఐటిసి, లీలా, హిల్టన్, మహేంద్ర హాలిడేస్ తదితర 30కిపైగా సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి. ఇప్పటికే అమరాంతిలో అతిద్యరంగానికుండే అవకాశాలపై ఈ సంస్థలు ఒక అధ్యయనాన్ని నిర్వహించాయి. 15కుపైగా మూడు లేదా ఐదు నక్షత్రాల హోటల్స్ ఇక్కడ అవసరమని గుర్తిచారు. రోజూ 2వేల నుంచి 2,500గదులు, పదివేల వ్యక్తులకు వసతి అవసరమౌతాయని కూడా నివేదిక రూపొందించాయి. ఇందుకు పలు కారణాల్నికూడా విశదీకరించాయి. అమరావతి అంతర్జాతీయ పెట్టుబడులకేంద్రంగా మారుతోంది. ఇక్కడ ఎలక్ట్రానిక్స్, ఐటి పరిశ్రమలు పెద్దసంఖ్యలో వస్తున్నాయి. ఈ ప్రాంతం చారిత్రకకాలం నుంచి పర్యాటక కేంద్రంగా ఉంది. ఇక్కడ బౌద్ధారామాలున్నాయి. 50 కిలోమీటర్ల వ్యాసార్ధంలో సుమారు. 60 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఒక్క అమరావతిలోనే రానున్న పదేళ్ళలో 8నుంచి 10 లక్షల మంది నివాసముండే పరిస్థితుంటుంది. ఇందు కనుగుణంగా ఆతిద్య రంగాన్ని అభివృద్ధి చేస్తే తద్వారా ఈ రంగంలో 15 వేల నుంచి 20 వేల మందికి ఉపాధి అవకాసాలుంటాయని రాష్ట్ర పర్యాటకశాఖ ఓనివేదిక సిద్ధం చేసింది. ఇది ఆర్థిక పురోగతికి దోహదపడుతుంది. అమరావతి కేంద్రంగా కొండపల్లి కోట, కోనసీమ, పాపికొండలు, సూర్యలంక బీచ్‌లకు కూడా పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని తన నివేదికలో పేర్కొంది.

## అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



మంగపతిదేవిపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్నా మేఘాలాదేవి

**కొయ్యలగూడెం,అన్నంరెడ్డి సుబ్బారావు, రాజధాని ప్రతినిధి :** కొయ్యలగూడెం ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు పరిధిలోని మంగపతిదేవిపేట, బోడిగూడెం గ్రామాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర మహిళ సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘాలాదేవి ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు జరిపారు. మంగపతిదేవిపేటలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం మధ్యాహ్నం 11.30 గంటలకే తాళం వేసి ఉండటాన్ని ఆమె గమనించారు. కేంద్రంలో పిల్లలుకానీ, అంగన్‌వాడీ వర్కర్‌కానీ ఎవరూ లేరు. ఆ గ్రామంలో ఉన్న మరో రెండు కేంద్రాలను కూడా ఆమె తనిఖీ చేసారు. అక్కడి పౌష్టికాహార నిల్వలను, రికార్డులను పరిశీలించారు. అక్కడి ఒక కేంద్రంలో ఉన్న పిల్లలను వారికి అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలసుకున్నారు. మరో కేంద్రంలో ఆమె సందర్శనకు వెళ్లిన తర్వాత ఇళ్ల దగ్గర ఉన్న పిల్లలను పిలిచి తీసుకురావటం జరిగింది. హాజరైన పిల్లల సంఖ్యకు హాజరు పట్టికలోని పిల్లల పేర్ల సంఖ్యకు సంబంధం లేక పోవటాన్ని కూడ ఆమె గమనించారు. బర్కిట్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మూడు రోజుల నుంచి పిల్లల హాజరు పట్టికను వేయకపోవటాన్ని ఆమె గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పరిస్థితుల పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేసారు. నివేదికను సంబంధితశాఖ ఉన్నతాధికారులకు పంపుతానని చెప్పారు.

## బోడిగూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు



**కొయ్యలగూడెం,అన్నంరెడ్డి సుబ్బారావు, రాజధాని ప్రతినిధి :** కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామంలో 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఆగ్రామ సర్పంచ్ శుక్లబోయిన శ్రీను 8లక్షలు రూపాయలు విలువగల అరెకరం పంటభూమిని విద్యుత్‌శాఖకు విరాళంగా వ్రాసి చ్చారు. సర్పంచ్ వితరణతో అక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కొరత సమస్య పరిష్కారం అయింది. రూ.2.90 కోట్లు వ్యయంతో అక్కడ 33/11.కె.వి.విద్యుత్ సబ్‌స్టేషన్,హెచ్.టి.విద్యుత్ లైను నిర్మాణాలకు చర్యలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని రాయుడు చెరువులో మెరకగా ఉన్న అరెకరంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం నిధులు మంజూరయ్యాయి. ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టటానికి స్థానిక ఎమ్మెల్యే, మొడియం శ్రీనివాసరావు, ఎం.పి. మాగంటిబాబు అప్పట్లో శంకుస్థాపన కూడ చేసారు. అయితే చెరువు భూమిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి జలవనరుల శాఖ నుంచి అనుమతి రాకపోవటంతో నిర్మాణం నిలచిపోయింది. ఇప్పుడు స్థలంలో సమస్య తేవటంతో నిర్మాణం పనులకు అవరోధాలు తొలగాయి. ఈ సభ్‌స్టేషన్ నిర్మాణం వల్ల చుట్టుప్రక్కల 10.గ్రామాలకు విద్యుత్‌లో వోల్టేజి సమస్య పరిష్కారం అవుతుందని సర్పంచ్ తెలిపారు.

## పోలీసుల త్యాగాలు మరువలేనివి

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని జంగారెడ్డిగూడెం ఎస్సై ఎం.కేశవరావు పేర్కొన్నారు. శుక్రవారం పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబమ్మ సెంటర్లో మానవహారం ఏర్పాటుచేసి అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ఎ.ఆనందరెడ్డి, భూపతిదేవ్, స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలో మంచినీటి సరఫరాకు ప్రాధాన్యమిస్తున్నామని చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి తెలిపారు. శుక్రవారం 8వ వార్డు లక్ష్మీ గణపతి పార్కు నుంచి సూరపరాజు కాలనీ వరకు 300 మీటర్ల మేర 4 అంగుళాల మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చోడగం వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పెనుమర్తి రామ్‌కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ముస్తఫా, కౌన్సిలర్లు కోలా కామేశ్వరి, ఎల్. రాజేశ్వరి, తెలుగుదేశం పార్టీ నాయకులు రాజాన పండు, గుమ్మడి వెంకటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, ఏఈ కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాసినో సెంటర్‌గా విజయవాడ

- తెలుగు రాష్ట్రాలపై కాసినో కన్ను
- రంగంలోకి మార్కెటింగ్ ఏరెంట్లు
- స్టార్ హోటల్స్ వేదికగా మలచుకుంటున్న తీరు





**హైదరాబాద్ :** కొలంబో ప్రధాన కేంద్రకంగా పనిచేస్తూ గోవాలో అనుమతితో నడుస్తున్న కేసినోకన్ను ఇప్పుడు తెలుగు రాష్ట్రాలపై పడింది. ఇందుకు సంబంధించి మార్కెటింగ్ ఏజెంట్లు రంగంలోకి దిగారు, కేసినో పట్ల ఆకర్షితులయ్యే విధంగా విజయవాడలో ఇప్పటికే స్టార్ హోటల్స్ వేదికగా ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఈ ప్రచారం కూడా సాదాసీదాగా జరుగుతోందనుకుంటే పప్పులో కాలేసినట్లే. అత్యంత ఆర్భాటకరరీతిలో ఈ ప్రచార కార్యక్రమానికి సదరు మార్కెటింగ్ ఏజెంట్లు పూనుకుంటున్నారు. డబ్బులున్న వారి వివరాలు తెలుసుకుని వారిని ఆహ్వానించే కార్యక్రమానికి ఈ మార్కెటింగ్ ఏజెంట్లు శ్రీకారం చుట్టారు. ఇటీవల గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి టీటీడీ ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురినిబురిడీ కొట్టించాడు. ఈ కేసులో నిందితుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సదరు నిందితుడు తాను సంపాదించిన చోరీసొత్తుతో గోవాకు వెళ్లి అక్కడ కేసినోల్ ఎంజాయ్ చేసి వచ్చినట్లు పోలీసులకు వెల్లడించాడు. సదరు వ్యక్తి వెళ్లేటప్పుడు విమానంలో వెళ్లి డబ్బులన్నీ గుల్లచేసుకున్న తర్వాత తిరిగి బస్సులో నగరానికి చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొలంబో ప్రధాన కేంద్రంగా సాగుతున్న కేసినో తన దృష్టినంతా రెండు తెలుగురాష్ట్రాలపై పెట్టిందా? అన్న అనుమానం కలుగుతోంది. ఇప్పటివరకూ కేసీనోల గురించి సినిమాలలోనే చూశాం. ఇప్పుడు ప్రత్యక్షంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆకర్షించే ప్రయత్నానికి కేసినో శ్రీకారం చుట్టడం.. ఏపీలో విజయవాడలో కేంద్రంగా కొన్ని స్టార్‌హోటల్స్‌లో ఇందుకు సంబంధించి సదరు మార్కెటింగ్ ఏజెంట్లు ప్రచారాన్ని నిర్వహించడమే కాకుండా.. కేసినోలో ఏమేం సదుపాయాలుంటాయి? ఎలా ఎంజాయ్ చేయవచ్చు? అనే అంశాలను ప్రతిబింబించే విధంగా ఆ ప్రచార కార్యక్రమానికి హాజరైన వారికి ఏకంగా అందుకు సంబంధించిన వీడియోలనే చూపించేస్తున్నాయి.

కేసినో పట్ల వారు ఆకర్షితులయ్యే విధంగా ఆఫర్లను ప్రకటిస్తుండటం జరుగుతోంది. కొలంబోకు ఉచిత విమాన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. మూడు లక్షలతో ఆరు లక్షల వరకూ జూదంకు అనుమతిస్తున్నాయి. అసలు కేసినో అంటే ఏమిటి? అక్కడ ఏం జరుగుతోంది? అని పరికిస్తే.. కేసినో అంటే సింపుల్‌గా మద్యం, మగువ, జూదం, నిరంతరం మద్యం సరఫరా ఉంటుంది. అక్కడకు వెళ్లిన వారికి మద్యాన్ని 90 శాతం అర్ధనగ్నంగా డాన్స్ చేసే విదేశీ మహిళలు వారి వారి టేబుల్స్ వద్దకు సరఫరా చేస్తారు. మరోవైపు కొందరు మహిళలు పోల్ డ్యాన్స్‌లు చేస్తుంటారు. నిరంతరం జూదం ఆడేందుకు టేబుల్స్ అందుబాటులో ఉంటాయి. ఇక్కడ అన్ని రకాల జూదాలు ఉంటాయి. ఒక రకంగా జూదాలు ఉంటాయి. ఒక రకంగా చెప్పాలంటే కాసినో అంటే భూలోక స్వర్గమే అన్న చందంగా కొలంబో నుంచి ఇక్కడకు వచ్చిన కేసినో మార్కెటింగ్ ఏజెంట్లు అదరగొట్టేస్తున్నారు. ఆ విధంగా ఆకర్షితులై అక్కడకు వెళ్లి వచ్చే వారిలో 90 శాతం మంది సర్వం పోగొట్టుకునే వారు ఉంటుండగా, పది శాతం మంది మాత్రమే స్వల్పలాభంతో తిరుగుప్రయాణిమవుతున్నారు. ఈ కేసినో విజయవాడ స్టార్ హోటల్స్‌ని వేదికగా చేసుకుని ప్రచారం చేపడుతున్నప్పటికీ వీరు చేపట్టే ప్రచార సమావేశాల్లో పెద్ద ఎత్తున డబ్బున్నవారు హాజరవుతుండటం గమనార్హం.


ఈ సమావేశాలకు విజయవాడ సరిసర ప్రాంతాలు గుంటూరు, రాజమండ్రితో సహ పలు ప్రాంతాల నుంచి డబ్బున్న వారు హాజరవుతున్నారు. అక్కడి నుంచి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కేసినో ఆసక్తి కనబరుస్తోందని చెబుతున్నారు. ఇంతలా కేసినో ప్రచారం ఊపందుకోవడం వెనుక ఉన్న కారణలేమైనా ఈ విధంగా కేసినో తెలుగు రాష్ట్రాల్లో తన ముద్రను ప్రతిబింబిచడంతో రానున్న కాలంలో కేసినోలు ఇక్కడ కూడా బలపడే విధంగా పావులు కదపడమన్నది ఆందోళన కలిగించే పరిణామమని చెప్పవచ్చు.

## రూ.123 కోట్లతో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం

**వేర్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ ప్రసాద్**

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** రాష్ట్రంలో రూ.123 కోట్ల వ్యయంతో కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తున్నట్లు వేర్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఎల్‌వీఎస్‌ఆర్కే ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం, భీమవరం ,గుంటూరులలో మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ (సీడబ్ల్యూసీ) సహకారం తీసుకుంటా మన్నారు. నాబార్డు రాష్ట్రంలో గోడౌన్లు నిర్మించడానికి రూ. 360 కోట్ల రుణాన్ని కేటాయించిందని తెలిపారు. వీటిలో రాష్ట్రంలో కేవలం 6.10 లక్షల మెట్రిక్ టన్నుల సరుకులను నిల్వ చేసే సామర్థ్యంతో గోడౌన్లు ఉన్నాయన్నారు. ధాన్యల దిగుబడి ఎక్కువగా ఉండడంతో పాటు మిర్చి టమోటా, చింతపండును నిల్వ చేసేందుకు గోడౌన్లను నిర్మించాల్సి ఉందని, దీనిపై సీడబ్ల్యు సీతో చర్చించామన్నారు. రాష్ట్రంలోని మార్కెట్ యార్డులు స్థలాలను కేటాయిస్తే తాము గోడౌన్లను నిర్మించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరో 6 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లను నిర్మిస్తామన్నారు.

# ట్రిపుల్ తలాఖ్ దీని కథేంటి?



## ఇస్లాం ధర్మశాస్త్రం ఏం చెబుతోంది ?

రాజ్యాంగంలో 44వ అధికరణలో ఆదేశిక సూత్రాలు చాలా ఉన్నాయి. మద్యపాన నిషేధం కూడా అందులో ఒకటి. ఎన్ని రాష్ట్రాలు దాన్ని అమలుచేస్తున్నాయి ? కేవలం మతధర్మాల విషయంలోనే ఎందుకీ ద్వంద్వ వైఖరి ..?ఉమ్మడి పౌరస్మృతి', 'ట్రిపుల్ తలాక్'లకు సంబంధించిన చర్చ మరోసారి ప్రారంభమైంది.

నిజానికి ఇది కొత్త చర్చేమీ కాదు. చాలా పాతదే. కాకపోతే అప్పుడప్పుడూ కొంతమంది పెద్దలు తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం దీన్ని వాడుకుంటూ ఉంటారు. అయితే ఈ మూడు తలాక్‌లను గురించి అసలు ఇస్లామ్ ధర్మశాస్త్రం (షరియత్) ఏం చెబుతుందో చూద్దాం.ఇస్లామ్ ప్రకారం 'నిఖ' (వివాహం) ఒక పవిత్రమైన బంధం, ఒప్పందం. దాన్ని కాపాడుకుంటూ, కలిసి కాపురం చేయ్యాల్సిన బాధ్యత ఇద్దరిపైనా ఉంటుంది. ఒకవేళ అనివార్యంగా ఏదైనా సమస్య వచ్చినపటికి ఇద్దరి మధ్యా విబేధాలు తలిత్తితే, పరస్పర సంప్రదింపుల ద్వారా ఇరుపక్షాల పెద్దమనుషుల ద్వారా పరిష్కరించుకోవాలని ధర్మం చెబుతోంది.



' తలాఖ్, తలాఖ్, తలాఖ్' అని పలికి ముస్లిములు భార్యలను వదిలేస్తున్నారు అన్న దుష్ప్రచారం విపరీతంగా జరుగుతోంది. కానీ సయోధ్య ప్రయత్నాలన్నీ విఫలమై ఇక కలిసి కాపురం చేయ్యడం దుర్లభం అని తేలిపోతే అనివార్యంగా విడాకులకు తీసుకోవడం జరుగుతుంది. దీనికోసం షరియత్ నియమనిబంధనలు తెలియజేసింది. అందరూ ప్రచారం చేసే తలాక్ సరైన పద్దతి కానేకాదు. దీన్ని 'తాలాకె బిద్ అత్' అంటారు. అంటే , ధర్మంలో లేనిదాన్ని ధర్మం పేరుతో ఆచరించడం అన్నమాట. అందుకే ఇలాంటి విధానాన్ని షరియత్ తీవ్రంగా గర్హించింది. అసలు విడాకులనే ఇస్లామ్ అత్యంత అవాంఛనీయ విషయంగా పేర్కొంది. 'ధర్మబద్ధమైన వాటిలో దైవానికి ఏమాత్రం ఇష్టం లేనిది విడాకులే' అని మహమ్మద్ ప్రవక్త చెప్పారు. అంటే వివాహ బంధాన్ని కలకాలం కాపాడుకోవాలని, కొనసాగించాలని ఇస్లామ్ అభిలషిస్తుంది. అనివార్య పరిస్థితులోనే, అయిష్టంగా విడాకులకు అనుమతిస్తుంది.. దీన్ని అర్ధం చేసుకోకుండా, చొక్కా మార్చినంత సింపుల్‌గా" తలాక్ తలాక్ తలాక్ ))అని భార్యల్ని మార్చేస్తారన్న అభాండం ఎంతమాత్రం సరికాదు. సయోధ్య ప్రయత్నాలన్నీ విఫలమై, ఇక రాజీకి అవకాశమేలేదని తేలిపోతే అప్పుడు అనివార్యంగానే విడాకులకు పోవాలి. విడాకులు మూడు సార్లు నెలకు ఒకటి చొప్పున ఇస్తారు. ఈ మధ్యలో ఉన్న కాలాన్ని 'ఇద్దత్' (గడువు) అంటారు. ఈ గడువు కాలంలో భార్యాభర్తలు రాజీ పడడానికి ప్రయత్నించాలి. ఇరు పక్షాల పెద్దలు సయోధ్య కుదర్చడానికి శక్తివంచన లేని ప్రయత్నం చెయ్యాలి. విడాకుల పత్రం (తలాక్ నామా) రాసుకోవడం ఉత్తమ విధానం. అందులో 'తలాకె రజయీ' (ఒకసారి విడాకు) అని స్పష్టంగా రాయాలి నమ్మకస్తులైన ఇద్దరువ్యక్తుల సమక్షంలో విడాకులు ఇవ్వాలి.

ఉమ్మడి పౌరస్మృతి గురించి తరచూ మాట్లాడేవారు రాజ్యాంగంలోని 44వ అధికరణను ఉటంకిస్తూ ఉంటారు. నిజానికి భారత రాజ్యాంగంలో ఒక్క 44వ అధికరణ మాత్రమే కాదు ఇంకా అనేకం ఉన్నాయి. అందులో 25వ అధికరణ కూడా ఉందన్న విషయం మనం మరిచిపోకూడదు. భారతదేశంలో వందలాది సంవత్సరాలుగా ముస్లిముల కోసం ప్రత్యేక చట్టం అమల్లో ఉంది. మొగల్ చక్రవర్తుల కాలంలో కూడా ఇస్లామీయ చట్టమే రాజ్యశాసనంగా అమలయ్యేది. అంటే సివిల్, క్రిమినల్ చట్టాలు కూడా ! వివాహాలు, విడాకులు, ఆస్తి పాస్తులు, వారసత్వం తదితర విషయాల్లో ముస్లిమేతరులకు వారి వారి మత ధర్మాల ప్రకారం నడుచుకొనే సంపూర్ణ స్వేచ్ఛ, అధికారం ఉండేవి. అంటే, ముస్లిమేతరులకు ప్రత్యేకంగా 'పర్సనల్ లా' ఉండేదన్నమాట. క్రీ॥శ. 1765లో ఈస్టిండియా కంపెనీ భారత న్యాయస్థానాలను పునర్ వ్యవస్థీకరించి, న్యాయవేత్తల సహకారంతో, ఆంగ్ల న్యాయమూర్తులు ఇస్లామియ శాసనాల కనుగుణంగానే తీర్పులిచ్చేవారు. ఆ తరువాత క్రమక్రమంగా ఆంగ్ల చట్టాలను ప్రవేశ పెట్టారు. ఈ విధంగా క్రీ॥శ. 1862 నాటికి ఇస్లామిక్ క్రిమినల్ లాను పూర్తిగా రూపుమాపి, ఆ స్థానంలో ఇండియన్ పీనల్ కోడ్‌ను విధించారు. అది ఈ నాటికీ కొనసాగుతోంది. ఈ విధంగా ఇస్లామిక్ చట్టాన్ని నికాహ్ (వివాహం) తలాఖ్ (విడాకులు) హిబా (దానం) విరాసత్ (వారసత్వం) లాంటి వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలకు ఇస్లామియే సాంప్రదాయిక చట్టాలు పురుడుపోసుకున్నాయి. ఉదాహరణకు హిందూ సంస్మృతి ప్రభావంవల్ల స్త్రీలకు ఆస్తిలో హక్కును నిరాకరించడం జరిగేది. ఈ కారణంగా ముస్లిం మేధావులు, సామాన్య ముస్లిముల కోరిక మేరకు 1937లో ఆంగ్లపాలకుల కాలంలో ముస్లిం పర్సనల్ లా ( muslim personal law shariathapplicatigx act 1937) ప్రవేశపెట్టడం జరిగింది. ముస్లింల పర్సనల్ లాలో ఉన్న 'షరియత్ యాక్ట్ 1937' ఏంచెబుతోందంటే , కక్షిదారులు ముస్లిములైన పక్షంలో నికాహ్, మహర్, తలాఖ్, ఖులా, మనోవర్తి, నికాహ్ రద్దు నిర్ణాయక శాసనం ( rule of decisign )) షరియత్ చట్టం ప్రకారమే ఉంటుంది. తరువాత క్రీ॥శ. 1939లో వీగిపోయిన ముస్లిం వివాహరద్దు చట్టం ( dissolution of muslimmarriages act1939) ని ఒక చట్టాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. అందులో ఇక ముస్లిం మహిళ భర్త నుంచి విడిపోదలిస్తే ఆ మేరకు ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. ఉదాహరణకు, భర్త గనక నాలుగేళ్ళపాటు చెప్పాపెట్టకుండా ఎటైనా వెళ్లిపోవడమో, లేదా వేధింపులకు, దౌర్జన్యానికి పాల్పడడమో, లేదా దీర్ఘకాలిక రోగాలకో, సుఖవ్యాధులకో గురై ఉండడమో జరిగితే నికాహ్ రద్దు విషయమై ఆమె కోర్టు నుంచి ఉత్తర్వులు((decree) పొందవచ్చు. పర్సనల్‌లా కేవలం నికాహ్, ఖులా, విరాసత్ లాంటి కొన్ని షరియత్ ఆదేశాలకే పరిమితమై లేదు. దీని పరిధి అంతకన్నా విశాలమైనది, విస్తృతమైనది. కేవలం పెళ్లి పెటాకుల నిబంధనలే కాదు, మొత్తం వారసత్వ వ్యవస్థ అంతా దీని పరిధిలో కొచ్చేస్తుంది. ఈ వ్యవహారాలకు సంబంధించి. ఏ అంశం వివాదాస్పదమైనా న్యాయస్థానం తన తీర్పును షరియత్ చట్టం ప్రకారమే ఇవ్వడానికి నిబద్ధమై ఉంటుంది. ఉదాహరాణకు, ఏ స్త్రీ అయినా భర్త వేధింపులకు విసిగిపోయి విడిపోదలిస్తే అందుకు భర్త అంగీకరించకుండా ఇబ్బందులు పెడుతుంటే ఆమె ధర్మాసనాన్ని ఆశ్రయించి షరియత్ చట్టం ప్రకారం తన వివాహాన్ని రద్దు చేసుకోవచ్చు. లేదా ఇస్లాం నిర్ణయించిన వారసత్వ హక్కును భర్త నిరాకరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తన హక్కును సాధించుకోవచ్చు. ఒక మహిళ తన హక్కును సాధించుకోవడంలో షరియత్ చట్టం ఇతోధికంగా ఆమెకు తోడ్పడుతందే తోప్ప ఏవిధంగానూ అవరోధం కాదు. అయినప్పటికీ ముస్లిం పర్సనల్ లాను మార్చాలని ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాలని దేశంలో పరివార్ శక్తులు పెద్ద ఉద్యమాన్నే ప్రారంభించాయి. ఇప్పుడు కేంద్రంలో 'తమ' ప్రభుత్వమే కొలువున్న నేపథ్యంలో ఇంకా ఇలాంటి అనేక అస్త్రశస్త్రాలకు అవి పదును పెడుతున్నాయి. సాధ్వినిరంజన్ జ్యోతి , సాక్షి మహారాజ్ వాక్రుచ్చినా, రవిశంకర్ జ్యోతి మాట్లాడినా, వెంకయ్య నాయుడు ఉలేఖించినా ఏ రూపంలో ఎవరు ప్రవచించినా ఉద్దేశం మాత్రం ఒకటే. నామమాత్రంగానైనా సరే ముస్లింల ప్రత్యేకతను ప్రతిబింభిస్తున్న ప్రస్తుత పర్సనల్ లా ను రూపుమాపి, ఆత్మ గౌరవంతో జీవించే హక్కును కాలరాయాలన్నది పరివార్ శక్తుల పన్నాగం. నిజానికి భారత రాజ్యాంగంలోని 25వ అధికరణ చాలా స్పష్టంగా ఇలా చెబుతోంది; " ప్రజలందరికీ సమానంగా భావ ప్రకటనా స్వాతంత్ర్యం ఉంటుంది. తమకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా స్వీకరించే, దాన్ని అవలంబించే దాన్ని ప్రచారం చేసుకునే హక్కు వారికి ఉంటుంది."మత స్వాతంత్ర్యానికి ఉద్దేశించిన ఈ అధికరణప్రకారం, ఏదైనా ఒక వర్గానికి చెందిన మత స్వాతంత్ర్యాన్ని హరించి, తన మత బోధనలకు వ్యతిరేకంగా ఆచరించాలని బలవంత పెట్టే ఎలాంటి 'సివిల్ కోడ్' కూ అవకాశం ఉండకూడదు. ఒక వేళ అలాజరిగితే అది నేరుగా మతంలో ప్రభుత్వ జోక్యం కిందికే వస్తుంది. అంటే, 'ప్రజలందరికీ తమ మతధర్మాన్ని అవలంబించుకునే పూర్తి సేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయ'న్న రాజ్యాంగ హామీకి అర్థమే లేకుండా పోతుంది. రాజ్యాంగంలోని ఇంత ముఖ్యమైన, ప్రధానమైన సూత్రాన్ని విస్మరించి, నిర్దేశిక నియమానికి సంబంధించిన 44ను మాత్రమే పట్టుకోడం నిజంగానే విడ్డూరం.

**- వ్యాసకర్త సయ్యద్ ఆబీద్ హుస్సేన్**
**9390001838**

## కామన్ సింగిల్ కోడ్‌పై ముస్లింల ఆగ్రహం




**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** భారతదేశంలో భిన్నంత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ముస్లింల పర్సనల్‌లా గురించి కొంతమంది మాట్లాడుతున్నారని ఇది మానవ కల్పితాలు కావని మహ్మద్ ప్రవక్త తలాక్‌కు సంబంధించిన మూలాలను రూపొందించారని జామాతే ఇస్లామీ హింద్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రఫీఖ్ తెలిపారు. ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తలాక్‌పై వస్తున్న విషయాలపై చర్చించడానికి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు మత పెద్దలు సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త వివాహ బంధాన్ని జీవితాంతం కొనసాగించాలని ఇస్లాం కోరుతుందని తప్పనిసరి పరిస్థిలుల్లోనే విడాకులకు అనుమతిస్తుందని తెలిపారు.

వివాహం తరువాత భార్యాభర్తల మధ్య వివాదాలు, ఘర్షణలు వచ్చినట్లయితే ముందుగా బంధువులు, సన్నిహితుల ద్వారా వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తారని అప్పటికీ అవి విఫలమైతే భార్యాభర్తల తరపున మధ్యవర్తులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని అప్పటికీ పరిష్కారం కాని పక్షంలోని ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. రాజకీయాల కోసం తమ మనోభావాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జామాతే ఇస్లామీ హింద్ అధ్యక్షులు అక్బర్, అహెలే హదీస్ స్టేట్ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్, నగర అధ్యక్షులు అతీకుర్ రహ్మాన్, యూత్ వెల్ఫేర్ అధ్యక్షులు షబ్లీ, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ చట్టంలో వేలు పెట్టొద్దు

**అఖిల భారత ముస్లిం సంఘాలు**

**ముంబై :** ముస్లిం వివాహ చట్టంలో వేలుపెడితే ఊరుకోమని అఖిలభారత ముస్లిం మజ్లిస్ ఎ ముషావారత్ సోమవారం హెచ్చరించింది. మూడుసార్లు తలాక్ చెప్పడంపై వారు స్పందిస్తూ ఉమ్మడి పౌరస్మృతి ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రభుత్వ తప్పిదాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ విషయాలను వెలుగులోకి తెస్తుందని, మత విషయాల్లో ప్రభుత్వాలు కలగచేసుకోరాదని మతబోధకులు, పండితులు వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని అఖిల భారత ముస్లిం వివాహ చట్ట బోర్డు తెలిపింది. ముస్లిం వివాహ చట్టంలో ఎవరైనా కలుగుచేసుకుంటే సహించబోమని దారులాం మహ్మదీయ అధ్యక్షుడు మౌలానా సయీద్ మెహ్మద్ ఖలీద్ అష్రాఫ్ హెచ్చరించారు. దేశంలోని ముస్లింలను కేంద్రం గౌరవించాలనీ,హ్రస్వ దృష్టి ఆమోదయోగ్యం కాదని అష్రాఫ్ అన్నారు. ఉమ్మడి పౌరస్మృతి కుట్రతో కూడిందని అఖిల భారత ఉలేమా కౌన్సిల్ అధ్యక్షుడు మౌలానా జహీరుద్దీన్ ఖాన్ విమర్శించారు. తలాక్, పై షరియా స్పందిస్తుందని ప్రభుత్వానికి సంబంధం లేదని అఖిల భారత ఉలేమా అసోసియేషన్ అధ్యక్షుడు మౌలానా సయీద్ అత్తర్ ఆలీ స్పష్టం చేశారు.

## తలాక్ అంటే విడిపోరు

**నియమ,నిబంధనలు వర్తిస్తాయి : ఎస్ చాంద్ బాషా**



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** ట్రిపుల్ తలాక్ అనగానే విడాకులు మంజూరవ్వవు, దానికి నియమ నిబంధనలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ పంచాయితీ పరిషత్‌కు అధ్యక్షుడు ఎస్ చాంద్ బాషా తెలిపారు. ప్రజల్లో అవగాహన లేక పోవడంతో రాజకీయ నాయకులు దీనిపై అభాం డాలు వేస్తున్నారన్నారు. తల్లాక్ చెప్పే ముందు కుటుంభ సృభులు కౌన్సిలింగ్ చేస్తారు. ఆతరు వాత పెద్దల సమక్షంలో,ఆపై మసీదు పెద్దలు కౌన్సిలింగ్ చేస్తారు. తరువాత ఖాజీ ( ప్రభుత్వం వారిచే నియమింపబడిన) కౌన్సిలింగ్ చేస్తారు. వీటి తర్వాత కూడా భార్య భార్తల మధ్య సయోధ్య కుదరకపోతే పెద్దలందరి మధ్య తలాక్ చెప్పవలసి ఉంటుంది. తలాక్ చెప్పేముందు వధువు పెళ్లికి ఎంత ఇచ్చిందో అంతకు రెట్టింపు ఇవ్వాల్సి ఉంటుంది. పిల్లల పెంపక బాధ్యత తీసుకోవాలి. అంతేకాని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చెప్పినట్లు నిరంకుశత్వంగా తాలాక్‌లు ఇవ్వరు. భారతదేశం ఎన్నో కులమతాలకు పుట్టినిల్లు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో కామన్ సివిల్ కోడ్ అమలు నిరంకుశమైన నిర్ణయమన్నారు. నిజానికి ముస్లిం మహిళల కంటే హిందువుల్లోనే విడాకులు ఎక్కువగా జరుగుతున్నాయని నివేదికలు వెల్లడించాయన్నారు.

## ఉమ్మడి పౌరస్మృతి కాదు, సంస్కరణలు కావాలి

**నూఢిల్లీ :** మతతత్వ శక్తులు మైనార్టీలపై అభియోగాలు మోపుతూ ఉమ్మడిపౌరస్మృతి పేరుతో భిన్నత్వంలో ఏకత్వాన్ని ఛిద్రం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని సీపీఎం విమర్శించింది. కేవలం ముస్లింమహిళలకే కాకుండా, హిందువులతో సహా మహిళలందరికీ సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వనికి సూచించింది. మూడు సార్లు తలాక్ చెప్పడం ద్వారా విడాకులు ఇవ్వడాన్ని సీపీఎం ఖండిస్తూనే హిందువుల్లో కూడా మహిళలపట్ల వివక్ష కొనసాగుతుందని దీనికోసం సంస్కరణలు చేపట్టాలని ఆపార్టీ కోరింది. ఉమ్మడి పౌరసత్వం ఉన్నంతమాత్రాన సమానత్వం ఉంటుందని భావిచలేం అని తెగేసి చెప్పింది హిందూ మహిళలకోసం సంస్కరణలు చేపట్టామని చెప్పడం బూట కమని, మహిళల సమానత్వం పేరిట మైనార్టీలను టార్గెట్ చేస్తున్నారన్నారు. దత్తత, ఆస్తిహక్కు, భర్తను ఎంచుకునే విషయాల్లో హిందూ మహిళలకు అవకాశంలేదని గుర్తు చేశారు. హిందూ వివాహ్ చట్టంలో కూడా సంస్కరణలు అవసరమని సీపీఎం స్పష్టం చేసింది.

## కామన్ సివిల్‌కోడ్‌పై ముస్లింల నిరసన

**ఎండీ కలీం**

**రాజధానిప్రతినిధి, గుంటూరు :** ఉమ్మడి పౌరస్మృతి (కామన్ సివిల్ కోడ్) పట్ల దేశవ్యాప్తంగా ముస్లింలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తపరుస్తున్న నేపధ్యంలో దీని అమలుకు కేంద్ర ప్రభుత్వ జోక్యం సరికాదని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు యండి.కలీం తెలిపారు. ఇటీవల కోజికోడ్‌లో జరిగిన భారతీయ జనతాపార్టీ జాతీయ సమావేశంలో దేశ ప్రధాని నరేంద్ర మోడి మాట్లాడుతూ ముస్లింలను ఓటు బ్యాంకుగా చూడకూడదని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని ప్రకటించారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బి.జె.పి. ఉమ్మడి పౌరస్మృతి ప్రగతిశీల సమాజం దిశగా ముందడుగు అని వ్యాఖ్యానించటంను కాంగ్రెస్, జె.డి.యు,ఎం.ఐ.ఎం.లతో పాటు అనేక ప్రతిపక్ష పార్టీలు, ముస్లిం పర్సనల్ లా బోర్డు, అనేక ముస్లిం సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. లౌకికవాద భారతదేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తే భిన్నత్వంలో ఏకత్వం దెబ్బ తింటుందన్నారు. ముస్లిం పర్సనల్ లాలో కేంద్ర ప్రభుత్వ జోక్యంపై త్వరలోనే గుంటూరు నగరంలోని ముస్లీం సంఘాలతో, మసీదు కమిటీలతో, అన్ని రాజకీయ పక్షాల ముస్లిం నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## ఈ ఏడాది అర్థ సంవత్సరం ఎగుమతుల్లోఫోర్ట్, జనరల్ మోటార్స్ టాప్

**న్యూఢిల్లీ :** ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ సంవత్సరం ప్యాసింజర్ కార్ల ఎగుమతుల్లో 15.38 శాతం వృద్ధి కనిపించింది. అమెరికాకు చెందిన ఆటో దిగ్గజాలు ఫోర్ట్, జనరల్ మోటార్స్‌లు ఎగుమతుల్లో తమ సత్తాచటాయి. దీనికి పోటీ కంపెనీలైన కొరియా, జపాన్‌కు చెందిన కంపెనీలు ఎగుమతులు పెంచుకోడానికి నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఆటోరంగానికి చెందిన సియామ్ఏప్రిల్-సెప్టెబర్ గణాంకాలను విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలంలో 3,67,110 యూనిట్లు ఎగుమతి చేయగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో 3,18,188 యూనిట్లు ఎగుమతి అయ్యాయి. ఎగుమతుల విషయానికి వస్తే హ్యుందాయ్‌మోటార్ ఇండియా అత్యధికంగా 87,449 యూనిట్లు ఎగుమతి చేసింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 2.01 శాతం వృద్ధి కనిపించింది. ఇక్కడ ఆశ్చర్యం ఏమిటంటే దేశీయంగా విక్రయించిన కార్లు 46,422 యూనిట్లు కంటే ఎగుమతి చేసినకార్లే ఎక్కువగా ఉన్నాయి. మారుతి సుజుకి విసయనికి వస్తే 7.87 శాతం క్షీణించి 60,526 యూనిట్లు ఎగుమతి చేసింది. ఎగుమతుల్లో మూడవ స్థానంలో ఉంది. నాలుగో స్థానంలో నిస్సాన్ మోటార్ ఇండియా ఎగుమతుల్లో 7.81 శాతం క్షీణించి 49.61 యూనిట్లు ఎగుమతి చేసింది. ఎగుమతుల్లో అత్యధికంగా జనరల్ మోటార్స్ రికార్డుస్థాయిలో 863.77 శాతం వృద్ధితో 30,647 యూనిట్లు ఎగుమతి చేసింది. అయితే దేశీయ 12, 059 యూనిట్లకార్లను విక్రయించింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 28.01 శాతం క్షీణించింది. జర్మనీకి చెందిన వోక్స్‌వ్యాగన్ విషయానికి వస్తే దేశీయంగా విక్రయించినకార్ల కంటే ఎక్కువగానే ఎగుమతి చేసిందనిసియామ్ వెల్లడించింది. ఏప్రిల్-సెప్టెబర్ కాలంలో 43,114 యూనిట్లు ఎగుమతి చేయగా.. క్రితం ఏడాదితో పోల్చు కుంటే 19.28 శాతం వృద్ధి నమోదు చేసింది. అదే దేశీయ మార్కెట్లో 23,329 యూనిట్లు కేవలం 0.45 శాతం తూర్పు యూరోప్ ఆఫ్రికా మార్కెట్లకు ఎక్కువగా ఎగుమతిచేశాయి.

## పురపాలక సేవలకు ఖైజలా యాప్

**రాజధాని ప్రతినిధి- విజయవాడ :**



ఒంగోలు రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా పురపాలక సంఘంలో ఖైజలా యాప్‌ను అమల్లోకి తెచ్చారు. పారిశుధ్యం, రెవెన్యూ, ఇంజనీరింగ్ పట్టణ ప్రణాళికా విభాగం సహా అన్ని సేవలకు ఈ యాప్‌ను వినియోగిస్తారు. తద్వారా ప్రజలకు మేలైన పారదర్శకమైన సేవలను అందించనున్నారు. కృష్ణా పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా రోడ్డుపై చెత్తా,చెదారాన్ని గుర్తించింది. ఖైజలా యాఫ్‌తోనే సాధ్యమైంది.ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఈ యాప్‌ను అన్ని శాఖల్లోనూ వినియోగిస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం పారిశుధ్య పనులకు రెవెన్యూ విభాగాలకు ఈ యాప్‌ను వినియోస్తున్నారు. దీని వలను అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా చెత్తకుప్పలు ఉన్నట్లు పౌరసేవలకు ఫిర్యాదు చేసినట్లయితే కమిషనర్ ఆ ప్రాంతం చేసి శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫోన్ చేసి ఖచ్చితంగా వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తారు. సంబంధిత ఉద్యోగి ఆ ప్రాంతానికి వెళ్లి ఆ గుట్టను ఫోటో తీసి యాప్‌లో పంపుతారు. సమస్య పరిష్కారం అయ్యాక కూడా మరో ఫోటో తీసి పంపుతారు. సదరు అధికారి ఎప్పుడు, ఎక్కడ నుంచి ఫోటో తీసి పంపించారు అనేది ఈ యాప్ చెబుతుంది. తద్వారా ఎక్కడో ఇంట్లో కూర్చొని ఫోటో తెప్పించుకుని అధికారికి పంపిద్దాం అనుకుంటే మన చలవ అని ఎక్కడ నుంచి అపరేట్ అవుతుందో యాప్ ఇట్టే పసిగట్టేసే సంబంధిత సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తుంది. ఇటువంటి ప్రక్రియ వలన ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుంది. యాప్‌ను సక్రమంగా వాడుకుంటే సంబంధిత ప్రాంతాల్లో సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అనేది కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా చూడొచ్చు. యాప్ ద్వారా పౌర సేవలు సక్రమంగా అందించవచ్చు. ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కారించడానికి వీలు కలుగుతుంది. ప్రస్తుతం అయితే అధికారుల సిబ్బంది మధ్య సమాచారా ప్రచారం ఉండేది. దీనికి ప్రజలకు కూడా వర్తింపజేసి వారి సమస్యలను నేరుగా అధికారులకు పంపే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ల ప్రజలకు అర్థమయ్యే విధంగా బ్యానుర్లు, హోర్డింగ్‌లతో యాప్ ప్రచారాన్ని చేపట్టారు. ఇప్పటికే ఆధునిక కెమెరాలను కొనుగోలు చేసి సిబ్బందికి అందజేశారు. ఆయా మున్సిపాలిటీల్లో ప్రజలు చేసే ఫిర్యాదులను పరిష్కరించే దిశగా మున్సిపాలిటీ సిబ్బంది అడుగులు వేస్తుంది. ఖైజలాయాప్ సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రజలకు మెరుగైన పాలన అందనుంది.

## నిధులు కేటాయింపుపై కౌన్సిలర్ల అసంతృప్తి

**రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జీఎన్.రావ్ :** ప్రణాళికాబద్ధంగా నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో ప్రజాసమస్యలు పరిష్కరించలేకపోతున్నామని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయితీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ చెల్లి శాంతకుమారి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నగర పంచాయితీలో ఎస్సి, ఎస్టి నిధులు, టిఎస్సి నిధుల నుంచి రోడ్లకు రూ.1.25 కోట్లు, డ్రైన్లకు రూ.85లక్షలు, మంచినీటి పైపులైన్లకు రూ.12లక్షలు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి నివేదించామని కమీషనర్ పి.రవివర్మ నిధుల మంజూరుకు కౌన్సిల్ ఆమోదం కోరారు. కోట్లలో నిధులు వస్తున్నా ప్రాధాన్యతా క్రమంలో కేటాయించలేకపోవడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావడంలేదని వైసిపి ఫ్లోర్ లీడర్ జనిపెల్ల రమేష్‌బాబు, కౌన్సిలర్లు కాశి బాలమునికుమారి, పిల్లి నాగరాజు, వేటుకూరి బోసురాజు, భీమవరపు విజయ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపులో వైసిపి కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో వివక్షత చూపుతున్నారని వారు ఆరోపించారు. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికావకపోవడంతో నగర పంచాయితీని బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పంచాయితీగా ధృవీకరణ చేయాలనే ప్రతిపాదనను కాశిబాలమునికుమారి వ్యతిరేకించారు. నగర పంచాయితీలో అనధికార లేఅవుట్లు వేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రతిపక్ష సభ్యులు కమీషనర్‌ను ప్రశ్నించారు. వార్డుల్లో వీధి దీపాల సమస్యలు, పందుల సంచారంపై అధికారులు పట్టించుకోడం లేదని, దోమల నిర్మూలనకు మందులు పిచికారీ చేసిన దాఖలాలు లేవని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. అనంతరం పలు సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నగర పంచాయితీ సిబ్బంది జీతభత్యాల చెల్లింపు, పైపులైన్ల రిపేర్లు, విద్యుత్ ఛార్జీలు తదితర పనులకు సంబంధించి ఒకటవ పద్దు నుంచి రూ.24,19,123, రెండవ పద్దు నుంచి రూ.7,56,045 ఖర్చులను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ దివి మహాలక్ష్మి, ఏఈ కె.వెంకట్రావులు పాల్గొన్నారు.

# చెత్త ఇస్తారా



ప్రపంచంలోని ఎన్నో దేశాలు చెత్త నిర్వహణ విషయంలో అనేక పాట్లు పడుతున్నాయి. నగరాల్లో కొండలా పేరుకుపోతున్న చెత్తను ఎక్కడ పారబోయాలో తెలీక కొన్ని దేశాలు భారీ కందకాలను తవ్వి భూగర్భంలో పాతి పెడుతుండగా మరి కొన్ని దేశాలు ఓడల్లో తీసుకువెళ్లి సముద్రాల్లో పారబోస్తుంటాయి. అదీ కుదరని దేశాలు ఎక్కడి చెత్తను అక్కడే తగలబెట్టేస్తుంటాయి. ఇవన్నీ పర్యావరణానికి తీవ్రమైన హాని చేస్తున్న చర్యలే. కాని స్వీడన్ పరిస్థితి వేరు. ఇక్కడ చెత్తకాగితాన్ని కూడా వృథా చేయరు. వార్థాలను ఇంధనంగా వాడుకుని విద్యుత్ తయారు చేసే దేశాల్లో స్వీడన్ ప్రథమ స్థానంలో ఉంటుంది. అందుకే తమ చెత్త తమకు సరిపోక ఇతర దేశాలను చెత్త కోసం అభ్యర్థిస్తోంది. ఇక్కడి రెనోవా ప్లాంటు ఒక్కటే 2010 లో 5.5 లక్షల టన్నుల చెత్తను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోగా 2014 నాటికి అది 8 లక్షల టన్నులకు చేరింది.

### యూరప్ నుంచే 10లక్షల టన్నులు

ఏటా ఒక్క యూరప్ నుంచే 10లక్షల టన్నుల చెత్త కొనుగోళ్లకు ఈ దేశం ఇప్పదం చేసుకుంది. గత ఏడాది విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. అందులో అధికభాగం బ్రిటన్ నుంచే ఉంది. మిగతా 4.65 లక్షల టన్నులను స్థానిక మున్సిపాలిటీలు విద్యుత్తు తయారీ ప్లాంటకు అందజేశాయి.

- "మీ ఇంట్లో... చెత్త ఉంటే దయచేసి బయట పారేయకండి.... తెచ్చి మా ఇంట్లో పోసి వెళ్లండి..."
- ఇతర దేశాలకు స్వీడన్ చేస్తున్న విజ్ఞప్తి ఇది... ఎందుకిలా ?

● ఈ దేశంలోని అధికారులు ఏ దేశంలో ఎక్కువ చెత్త పోగుబడి ఉందో నిరంతరం ఓ కన్నేసి ఉంచుతారు. ఎక్కువ మొత్తంలో ఎక్కడైనా కనిపించగానే బతిమిలాడి తెచ్చేసుకుంటారు. 'ఏ దేశమూ చెత్త నిర్వహణ విషయంలో బాధపడే పనిలేదు. వారికి మాదీ భరోసా' అంటోంది ఈ చిన్న దేశం.

● చెత్త నిర్వహణ ఖర్చును, పర్యావరణపరమైన హానిని తగ్గించుకోవాలంటే ఒక పని చేయండి... మీ నౌకల్ని ఖాళీగా ఉంచకుండా దాని నిండా చెత్త నింపి మాకు పంపేయండి అని భరోసా ఇస్తోంది కూడా.. స్వీడన్ ప్రపంచంలో చెత్త నిర్వహణలో అత్యుత్తమమైన దేశం ఇదే. చుట్టుపక్కల ఉన్న వేలాది గృహాలకు గొట్టాల ద్వారా వేడిమిని పంపిస్తుంటాయి. యూరప్‌లోని అత్యంత చలి దేశమైన స్వీడన్ వాసులకు ఆ వేడి అందకపోతే జనం గడ్డకట్టుకుపోతారు.

● ఆ దేశంలో ఒక్లో ప్లాంటు నుంచి దాని పరిధిలోని 9.5 లక్షల ఇళ్లకు చెత్త నుంచే వేడిమి అందుతుంటుంది.

● 2.6 లక్షల ఇళ్లకు విద్యుత్తు అందజేస్తుంటారు.

● చాలా దేశాల్లో విద్యుత్తు, వేడిమి ఉత్పత్తి కోసం గ్యాస్ లేదా ఇతర ఇంధనాలను వాడుతుంటారు. ఇక్కడ మాత్రం చెత్తతో ఉత్పత్తి చేస్తుంటారు.

### 1940 ల నుంచే మొదలు

● 1940 లలోనే చెత్తనుంచి విద్యుత్తు తయారీ ప్లాంట్లు నెలకొల్పారు.

● ప్రస్తుతం ఈ దేశంలో వెలువడే చెత్తలో కేవలం ఒక్క శాతం కంటే తక్కువ మాత్రమే వృథాగా పారేస్తుంటారు.

### వ్యర్థాల నిర్వహణ ఇలా...

● మొదటి చెత్తలో పునర్వినియోగానికి పనికొచ్చే వస్తువుల్ని వేరుచేస్తారు.

● మిగిలినదాన్ని విద్యుతుత్పత్తి ప్లాంటుకు పంపిస్తారు.

● బూడిదలో మిగిలిన లోహాలను వేరుచేసి పునర్వినియోగానికి తరలిస్తారు.

● రాళ్లు,గాజు పెంకులు,పింగాణీ ముక్కలను రహదారుల నిర్మాణానికి పంపిస్తారు.

### ప్రజల భాగస్వామ్యం

● ఇక్కడి ప్రజలు మనలాగా చెల్ల అంతా కలిపి ఓ బుట్టలోనో,కవర్‌లోనో వేసి బయటకు విసిరేయరు. పునర్వినియోగానికి పనికొచ్చే వాటిని ఎవరికివారే విడదీసి వేరే బుట్టలో వేస్తారు. ఇలా చేయకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వీరు తమ ఇళ్లలోని 96 శాతం వ్యర్థాలను పునర్వినియోగానికి సిద్ధం చేస్తుంటారు.

### ప్రపంచంలో ఎక్కడెక్కడ?

- చెత్త పునర్వినియోగంలో స్వీడన్ అగ్రస్థానంలోఉండగా చెక్ రిపబ్లిక్,డెన్మార్క్,నార్వే,ఫిన్లాండ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- ఆస్ట్రియా, జర్మన్ దేశాలు 60శాతం వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తున్నాయి.
- అమెరికాలో 12 శాతం మాత్రమే పునర్వినియోగిస్తున్నారు.
- పశ్చిమ ఐరోపా దేశాల్లోనూ ఇంతే చెత్త పునర్వినియోగిస్తున్నారు.
- 2020 నాటికి ప్రతీ దేశం కనీసం సగానికి సగం చెత్తను పునర్వినియోగించాల్సిందేనని ఐరోపా సమాఖ్య నిర్ణయించింది.



### మనం కూడా చేయొచ్చా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 10 ఏళ్ల క్రితమే చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి పథకాలను మొదలు పెట్టినా అవి ఆదిలోనే పడవేశాయి. కొన్నినాటి పాలకుల కుంభకోణాలతో అభాసుపాలయ్యాయి. ఇలాంటి ప్రాజెక్టులు పెట్టాలనుకుంటే ప్రపంచ ఆర్థిక సంస్థల నుంచి సహకారం పొందవచ్చు అయితే పునర్వినియోగంతోపాటు వ్యర్థాలను, ఉద్గారాలను తగ్గించడంపై దృష్టి పెడతామనే హామీ ఇవ్వాల్సిఉంటుంది.వ్యర్థాలను తగలబెట్టడం కంటే భూమిలో పూడ్చిపెట్టడమే ఎక్కువ ఖర్చుతో కూడినదని స్వీడన్ స్వీయ అనుభవంతో చెబుతోంది.

# మన ఊరు - మన ఎమ్మెల్యే

**అమలాపురం :** అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు - మన ఎమ్మెల్యే కార్యక్రమం అమలాపురం మండలం ఇమ్మిడివరప్పాడు, రోళ్ళపాలెం గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు, వాటిని ఏవిధంగా పరిష్కరించాలనే విషయాలను స్వయంగా తెలుసుకునేందుకు మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. మందవారిపేట, రాజీవ్‌కాలనీ, కొత్తకాలనీ, చిల్లేవారిపేటలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్లు, డ్రైనేజీలు, ఇంటిలోన్లు, ఇళ్ళ స్థలాలు,మంచినీరు తదితర సమస్యలను ప్రజలు తెలియజేశారన్నారు. ఈ సందర్భంగా ప్రజలు మన ఊరు -మన ఎమ్మెల్యే కార్యక్రమం చాలా బాగుందని దీని ద్వారా గ్రామాలాభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు మల్లుల పోలయ్య, సర్పంచ్‌లు మంద గెద్దయ్య, పితాని కనకమహాలక్ష్మి, బి.ఎస్.రాధమ్మ, ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంతర పంటల సాగుకు ప్రాధాన్యతనివ్వాలి



### ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

**అమలాపురం :** కొబ్బరి దిగుబడి రానురాను తగ్గిపోవడం, ధర క్రమేపీ పడిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు కొబ్బరిలో అంతర పంటల సాగుకు ప్రాధాన్యతనిచ్చి అధిక దిగుబడులు సాధించేందుకు ముందుకురావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో కొబ్బరితోటల భీమా సౌకర్యం కల్పించడంపై కోనసీమ ప్రాంతంలోని రైతాంగానికి అమలాపురంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన ఒక్కరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొబ్బరిలో అంతర పంటగా కోకో, మిరియాలు, పసుపు వంటి పంటలను అధికంగా సాగుచేరసి ప్రభుత్వం కల్పించే రాయితీలతో అధిక లాభాలను ఆర్జించవచ్చని మంత్రి అన్నారు. ఉద్యాన పంటలపై రైతులను ప్రోత్సహించేందుకు, అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు కడియంలో వంద ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవన విశ్వవిద్యాలయానికి సంబంధించి కేంద్ర మొక్కల పంటల పరిశోధనా సంస్థ (సిపిసిఆర్ఐ) ప్రాంతీయ కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంలో రెండంకెల వృద్ధి రేటును సాధించేందుకు అనేక చర్యలు చేపట్టిందని అన్నారు. కోనసీమ ప్రాంతంలో లంకలు ఎక్కువగా ఉన్నందున రైతులు ఇళ్ల వద్ద, పొలాల్లో కూడా కాయకూరలను అధికంగా పండించాలని మంత్రి సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కొబ్బరి పంటకు అధిక నష్టం సంభవించే వీలున్నందున రైతులు ఉద్యానవన శాఖ ద్వారా కొబ్బరి చెట్లకు కల్పిస్తున్న భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతర పంటల సాగుకు కోకో మొక్కలు తక్కువగా ఉన్నందున ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కొబ్బరి రైతులకు అధిక సంఖ్యలో కోకో మొక్కలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2018నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి వ్యవసాయానికి పూర్తిస్థాయిలో నీటిని అందించడం జరుగుతుందని మంత్రి అన్నారు. యంత్ర పరికరాలపై ప్రభుత్వం అదించే 50 శాతం సబ్సిడీని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. అలాగే ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో రైతులకు అనువైన పథకాలకు అధికారులు డిజైన్‌చేసి నివేదిక మంత్రివర్యులకు ఇవ్వాలని సూచించారు. కోనసీమలో రైతులకు ముంపు బెడద ఎక్కువగా ఉందని దీని నివారణకు తగిన ప్రణాళిక రూపొందించి త్వరలోనే శాశ్వత పరిష్కారం కల్పించడం జరుగుతుందన్నారు. ముందుగా ఉద్యానవనశాఖ రైతులకొరకు ఏర్పాటుచేసిన వ్యవసాయ యంత్ర పరికరాలు, ఇతర పనిముట్లు, మొక్కలను పరిశీలించారు. అలాగే 13 జిల్లాలను వ్యవసాయపరంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, జెడ్‌పిటిసిలు అధికార జయవెంకటలక్ష్మి, వేగిరాజు ప్రవీణ, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మెట్ల రమణబాబు, రైతు నాయకులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, అమలాపురం ఉద్యాన వనశాఖ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముద్రగడ పాదయాత్ర మర్మం చెప్పాలి

### హోంమంత్రి

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** ముద్రగడ్డ పద్మనాభం రావులపాలెం నుంచి అంతర్వేది వరకు చేస్తున్న పాదయాత్ర వెనుక ఎవరు ఉన్నారో ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కోరారు. నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ పార్టీకి చెందిన భూమన కరుణాకరరెడ్డి పాత్ర దీని వెనుక ఉన్నట్లు భావించాల్సి వస్తుందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టి శ్రేణులు, జగన్ ముద్రగడ్డ పద్మనాభం చేస్తున్న పాదయాత్రకు మద్దతు తెలపటం దీని వెనుక ఉన్న రహస్య ఎజెండాను తెలియజేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి వీరు వ్యూహం పన్నినట్లు తెలుస్తుందన్నారు. పాదయాత్రకు సంబంధించి ముద్రగడ్డ పద్మనాభం విడుదల చేసిన కరపత్రం అనంతరం భూమన కరుణాకరరెడ్డి మాట్లాడటం వెనుక ఉన్న రహస్య ఎజెండా దీన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. ప్రజలు ఈ విషయాలన్నీ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, తుని సంఘటనలో భూమన కరుణాకరరెడ్డి పాత్ర ఉందనడానికి ఇంతకన్నా నిదర్శనం లేదన్నారు.

కాపులను బి.సీలో చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనునిత్యం శ్రమిస్తున్నారని తప్పకుండా కాపులకు న్యాయం జరుగుతుందని, ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి కూడా కాపులకు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, 350 మంది కాపు విద్యార్థులను విదేశాలలో చదువుకోవడానికి పంపిన చరిత్ర కూడా ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కాపు నిరుద్యోగులు 500 మందికి సివిల్స్ లాంటి కోచింగ్ సెంటర్లలో రాష్ట్ర ప్రభుత్వం కోచింగ్ ఇప్పిస్తుందని తెలిపారు. 20 సంవత్సరాలు రాజకీయాల్లో ఉన్న ముద్రగడ్డ ఏ రోజు కాపు రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా కాపు కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారన్నారు. 1994 లో ఈయన ఉద్యమం చేసినప్పుడు కొద్ది మంది కాపులు చనిపోవడం కూడా జరిగిందని, మరలా అలా చేయటానికి ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కాపు కార్పొరేషన్, మంజూనాథ కమీటీలను ఏర్పాటు చేశారన్నారు. కాపులను బి.సిలలో చేర్చడం తప్పనిసరిగా ముఖ్యమంత్రి ద్వారానే జరుగుతుందని, బి.సిలకు కూడా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చేయడానికి ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముద్రగడ పద్మనాభంకు వై.సి.పి మద్దతు ఉందని, ఇది బహిరంగంగా వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ టి.డి.పి ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని, 70 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో కాపుల ఓట్లతో గెలిచి, కాపులను అన్ని పార్టీలు మరిచిపోయారన్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని తెలిపారు. ముద్రగడ పద్మనాభం వ్యక్తిగతంగా కాపులను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని అనుకుంటున్నారన్నారు. తుని ఘటనలో వై.సి.పి పార్టితో రహస్య ఎజెండా ఉందని దాన్ని బయట పెట్టాల్సిన అవసరం ముద్రగడ పద్మనాభంపై ఉందన్నారు. వెయ్యి కోట్లతో కాపు కార్పొరేషన్ యేర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఆయన తెలిపారు. కాపులను విదేశాలలో చదువు కోసం పంపిన ఘనత, బి.సి కమీషన్ ఏర్పాటు ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ముసుగులు తొలుగుతున్నాయని దాసరి, చిరంజీవి, అంబటిరాంబాబు, బొత్ససత్యన్నారాయణలు కులాన్ని అడ్డం పెట్టుకుని పదవులు తెచ్చుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పది సంవత్సరాలు అధికారంలో ఉండి, ప్రజలకు చేసిందేమి లేదని, అందుకే ప్రజలు తిరస్కరించారని తెలిపారు. ప్రజలు ఆలోచిస్తున్నారని కులాల పేరుతో రాష్ట్రంలో చిచ్చు పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కల్పించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కాపులను బి.సిలో చేర్చడానికి అన్ని విధాల ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. కాపు సామాజికవర్గానికి మేలు జరగడానికి సూచనలు ఇవ్వండి అంతే గాని సామాజిక వర్గానికి కీడు చేసే విధంగా రాజకీయాలు చేయొద్దని తెలిపారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒక వైపు కాపులను రెచ్చగొట్టడం, రెండో వైపు మంజునాథన్ కమీషన్ విచారణను అడ్డుకోవడం చేస్తున్నారన్నారు. దీనివల్ల కాపులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. కాపులకు బి.సి స్టేటస్ ఖచ్చితంగా అమలు జరుగుతుందని, ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఆగదని తెలిపారు. రోజా గురించి మాట్లాడటం వృథా అని ఆమెను మహిళలే అసహ్యించుకుంటున్నారని తెలిపారు.

# విత్తనాల కొరతలేకుండా చూడాలి



**రాజధాని,ప్రతినిధి, విజయవాడ:** విజయవాడలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలుకీలక నిర్ణయాలు తీసుకోవటం జరిగింది. రాష్ట్రంలోని రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడటానికి తగిన ఏర్పాట్లపై, అదేవిధంగా నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలకు సిఫారసు చేయటం జరిగింది. క్యాబినెట్ లో జరిగిన పలువిషయాలను సమాచార పౌరసంబంధాలు,ఐటీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖల మంత్రి పల్లె రఘునాధ రెడ్డి పాత్రికేయులకు వివరించారు.

# పోలీసు వారోత్సవాల్లో భాగంగా రక్తదానం



**అమలాపురం :** అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్టేషన్‌లో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ఎల్.అంకయ్య ప్రారంభించారు. అల్లవరం మండల టిడిపి సీనియర్ నాయకులు వేగిరాజు వెంకట్రాజు ఆధ్వర్యంలో సాధనాల వెంకట్రావు, ఎంట్రుకోన సర్పంచ్, పలువురు నాయకులు తదితరులు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డిపార్ట్‌మెంట్ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి

### మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల



**అమలాపురం :** అమలాపురం పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధిచేస్తానని మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల వినాయకరావు(గణేష్) అన్నారు. బుధవారం పురపాలక సంఘ సమావేశపు హాలులో అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ, అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అందరి సహాయ సమకారంతో అభివృద్ధిచేస్తానని అమలాపురం మున్సిపాలిటీని ముందుకు తీసుకువెళతానన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన తరువాత మొదటి సమావేశం 10.45 గంటలకు ప్రసంగిస్తూ తన రాజకీయ గురువు, మాజీమంత్రి అయిన స్వర్గీయ డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు, మున్సిపల్ ఛైర్మన్ స్వర్గీయ యాళ్ల మల్లేశ్వరరావులను స్మరించుకున్నారు. కౌన్సిలర్ సభ్యులు అందరూ పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. 30 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎన్నికైన నాటి నుండి శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. తామరచెరువును రూ.40 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అమలాపురం పట్టణంను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానన్నారు. అలాగే సమావేశంలో కౌన్సిలర్లు సూచించిన పలు సూచనలు అమలకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 25వ తేదీన మున్సిపల్ శాఖామంత్రి నారాయణ, ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు, ఎంపి డాక్టర్ పండుల రవీంద్రబాబు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులకు పౌరసన్మానం చేయనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బంది తీవ్రంగా ఉందని దీనిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్.శ్రీనివాస్, 30వార్డుల కౌన్సిలర్లు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# తుళ్లూరు బస్టాండ్ అభివృద్ధికి చర్యలు



**రాజధాని, ప్రతినిధి - తుళ్ళూరు :** రాజధాని ప్రాంతం, మండల కేంద్రమైన తుళ్ళూరులోని ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు.సదరు బస్టాండ్ నిర్మాణానికి 1977లో అప్పటి రవాణా శాఖ మంత్రి చేబ్రోలు హనుమయ్య శంకుస్థాపన చేయగా 1981లో రవాణా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కె.రోశయ్య బస్టాండ్‌ను ప్రారంభించారు. విజయవాడ ,గుంటూరు, మంగళగిరి , అమరావతికి ఈ బస్టాండ్ మీదుగా బస్సుల రాకపోకలు సాగుతుంటాయి.ఈ ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించడంతో బస్టాండ్‌కు ప్రాధాన్యత పెరిగింది.వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం నుంచి ప్రభుత్వ పాలన మొదలవడంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు పెంచారు.బస్టాండ్ ప్రాధాన్యత పెరిగినప్పటికి అభివృద్ధికి మాత్రం నోచుకోలేదన్నా అభిప్రాయం అందరిలోనూ ఏర్పడింది. బస్టాండ్ చుట్టూ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఇబ్బందికరంగా మారింది.ఈ నేపథ్యంలో బస్టాండ్ దుస్థితిపై స్థానికులతో పాటు ప్రయాణీకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తువచ్చారు. దీంతో ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ అభివృద్ధిపై దృష్టి సారించారు.బస్టాండ్‌లోని గుంతలను గ్రావెల్‌తో పూడ్చేందుకు చర్యలు తీసుకున్నారు.

# ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి పూర్తిస్థాయిలో సేవలు


**అమలాపురం :** ప్రజలకు అవసరమైన సేవలు అన్నింటిని ఆన్‌లైన్ ద్వారా పూర్తి స్థాయిలో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంశాఖామంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. నూతనంగా అమలాపురలోని బండారు హోండా షోరూమ్‌లో ఆన్‌లైన్ ద్వారా వాహన రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అమలాపుం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నిర్మూలించి షోరూమ్‌లో వాహనాన్ని డెలివరీ చేసే సమయంలోనే రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని దీనివలన కొనుగోలుదారుడు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్ళవలసిన అవసరం ఉండదని, మధ్యవర్తుల ప్రమేయం ఉండదని, కొనుగోలు చేసిన రోజు రిజిస్ట్రేషన్‌తోపాటు వ్యయం కూడా తగ్గుతుందన్నారు. హెవీ వెహికల్ లైసెన్సు జారీలో కూడా జాప్యం చేయకూడదని అన్నారు. ప్రమాదాల నివారణలో ఆర్అండ్‌బి, పోలీసు, రవాణాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం ఆధారంగా పరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్నారని, ఇది కేవలం ముఖ్యమంత్రికే సాధ్యమని అన్నారు. పారదర్శకమైన పాలన ప్రజలకు అం దించాలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గాల డేష్ బోర్డు కూడా సక్రమంగా ఏర్పాటుచేశారని, దీనివల్ల పేదలకు పథకాలు సక్రమంగా అందుతున్నాయని అన్నారు.అనంతరం ఈదరపల్లికి చెందిన గంటా నవ్య విజయదుర్గ హోండా షైన్ వాహనం కొనగా ఆమెకు పర్మినెంట్ వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మెట్ల రమణబాబు, మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్, ఆర్డీఓ గణేష్‌కుమార్, జిల్లా డిటిసి కుమారి సిరి ఆనంద్, సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్, ఆర్టీఓ ఆర్.నాగేశ్వరరావు, బండారు హోండా ఎండి బండారు సంజీవ్, ఎంవిఐ నరసింహరావు, బోగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంద్ !

**న్యూఢిల్లీ:** పెట్రోల్ బంకులు వినియోగదారులకు షాకివ్వనున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వచ్చే నెలలో దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగేందుకు సిద్ధమయ్యాయి. 2012లో కేంద్రం ఇచ్చిన హామీలను అమలుచేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో నవంబర్‌లో బంకుల యాజమాన్యాలు 5రోజుల సెలవు ప్రకటించాయి. నవంబర్ 3, 15న బంకులు పూర్తిగా మూతపడే అవకాశమున్నట్లు సమాచారం. పబ్లిక్ హాలిడేలు, సెలవు దినాల్లో బంకులు తెరవకూడదనే నిర్ణయానికొచ్చాయి. నవంబర్ 5 నుంచి బ్యాంకు సెలవులు, పండుగ రోజుల్లో దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు మూతపడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు ఈ నిరసనకు మద్ధతు ప్రకటిస్తూ అక్టోబర్ 19, 26 తేదీల్లో రాత్రి 7 నుంచి 7.15 వరకూ పెట్రోల్ బంకుల్లో లైట్లను ఆఫ్ చేయనున్నారు. పావు గంట పాటు పెట్రోల్ గానీ, డీజిల్ గానీ అమ్మకూడదని నిర్ణయించుకున్నారు.

## సినిమా


# గుజరాత్ అల్లర్లను కళ్లకు కట్టిన
# 'ఫైనల్ సొల్యూషన్'



దర్శకుడు రాకేశ్ శర్మ

హిందీ చలన చిత్రకారుడు రాకేష్‌శర్మ 2002-03లో గుజరాత్ లో మెజారిటీ మతం పేరుతో ఆనాటి ముఖ్యమంత్రి నరేంద్రమోడీ పాలనాకాలంలో మైనారిటీలపై జరిగిన దారుణ మారణకాండపై చలించి, ఆగ్రహించి నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రం "ఫైనల్ సొల్యూషన్ " మొదట ఈ డాక్యుమెంటరీ విడుదలను నాయకులు నిషేధంచారు. ఇందులో ప్రతీకార జ్వాలకంటే విద్వేషంతో హిందూత్వ శక్తులు (కర్రపదాతి దళాలు) దారుణకాండకు పాల్పడ్డాయని శర్మ తన పరిశీలనలో అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ప్రజల ఒత్తిడి, డాక్యుమెంటరీ చిత్రం పైరేట్‌గా, ప్రైవేటుగా విస్తృతంగా పంపిణీ జరగడం వల్ల ఎట్టకేలకు ఫైనల్ సొల్యూషన్ విడుదలకు సెన్సార్ బోర్డు అంగీకరించింది.

ఎవరినీ ప్రశంసించడానికి లేదా పోరాట కార్యకర్తగా తాను ఈ చిత్రం నిర్మించలేదని సెన్సార్ బోర్డు సభ్యులు కొందరి కోరిక మేరకు 2014 అక్టోబరు రెండవ వారం చివరిలో ఏర్పాటు చేసిన 'ట్రయల్‌షోలో రాకేష్‌శర్మ విలేకరులకు తెలిపారు. ఇందులో సెక్యులర్, ఫాసిస్ట్, మతోన్మాదంలాంటి నినాదాలను కావాలని ఎక్కడా చొప్పించలేదు. ఆనాటి మారణకాండపై నిర్మించిన డాక్యుమెంటరీలలో ప్రస్తుతం విడుదలైంది నాల్గవ భాగం. పూర్తిగా వాస్తవ పరిస్థితులను నేపథ్యంగా తీసుకున్నారు. రాష్ట్రమంతటా అనేకసార్లు తిరిగి జీవించి ఉన్న బాధితులను, మారణ కాండలో పాల్గొన్న కర్రపదాతి దళాలను (సంఘ పరివార్ శక్తులు) కలుసుకుని ఇంటర్వ్యూలు చేసి వారు చెప్పిన అంశాలను శర్మ వీడియో రికార్డు చేశారు. వీటిని చిత్రం మధ్య మధ్యలో జతచేశారు. వీడియో చిత్రాన్ని పదివేలకు పైగ కాపీ చేయించి గుజరాత్‌లో ప్రత్యేకించి దళితులు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో పంపిణీ చేశారు. తాజాగా తీసిన డాక్యుమెంటరీలో దాడులలో ప్రత్యక్షంగా పాల్గొన్న కుటుంబాల సభ్యులను, ఆదేశాల మేరకు నరమేధానికి కుట్ర పథకం పన్నిన కుటుంబాలకు చెందిన వారిని రాకేష్ శర్మ కలుసుకుని చేసిన ఇంటర్వ్యూలో చోటు చేసుకున్నాయి. నరమేధం జరిగిన పది సంవత్సారాల తర్వాత ఆయన ఎంతో శ్రమకోర్చి 'కరసేవకుల' కుటుంబాలను




కలుసుకుని మాట్లాడారు. సమూహాలను హతమార్చిన వారిలో వీరున్నారు. అయితే వీరిపైన ఆస్తుల లూటీ, దాడులు జరపడంలాంటి స్వల్పమైన కేసులను నమోదు చేశారు. ఆనాడు నరమేధానికి పాల్పడిన వారంతా ఇప్పుడేమను కుంటున్నారో తెలిస్తే నివ్వెరపోవలసినని శర్మ పేర్కొన్నారు. ఎవరెవరిపై ఎలాంటి కేసులను నమోదు చేశారు. కేసుల నమోదులో కులవివక్ష ఎంత దారుణంగా ఉందో తెలిస్తే పాలకులు చెప్పే మాటలకు, ఆచరణకు ఏమాత్రం పొంతనలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి అధికారికంగా సేకరించిన వివరాలతో గుజరాత్ కులనిర్మూలన సమితి తయారు చేసి విస్తృతంగా పంపిణీ అయిన చిన్న పుస్తకం ప్రస్ఫుటం చేసింది. 2002లో జరిగిన ఘోర దురంతాలపై కేసులు నమోదు చేసి జైలులో పెట్టిన వారి రికార్డు ఇలా ఉంది. ఇద్దరు బ్రహ్మణులు నలుగురు బనియాలు, 17 మంది పటేళ్లు, 27 మంది ఓబీసీలు, 797 మంది దళితులు ఉన్నారు.

### నాయకుల పాత్రను పట్టించుకోని చట్టం

కుట్ర పన్ని పథకం ప్రకారం భారీ హింసాకాండను జరిపిన లీడర్లందరినీ దాదాపు ముట్టుకొలేదు. మాయకొదాని, బాబు బజరంగి, జైదీప్ పటేల్ లాంటి కొద్ది మందిపైనే కేసులు పెట్టారు. తక్కిన వారంతా హాయిగా తప్పించుకొని తిరుగుతుండగా కర్రపదాతి దళాలు, దళితులు, ఓబీసీలు మాత్రమే బలపశు వులయ్యారు. గిరిజన ప్రాంతాలలోనూ పనిస్థితి ఏ మాత్రం భిన్నంగా లేదు. అంతేకాదు ఉత్తమమైన న్యాయ సహాయం అగ్రకులాల వారికి ఇచ్చి, తక్కిన వారందరికీ ఏదో నామమాత్రం న్యాయసహాయం కల్పించారు. వీరందరిదీ బాధా తప్త కథే. భావోద్వేగాలను రెచ్చగొట్టి కుటిలమైన తెలివితేటలతో తమను ఉపయోగించికుని ఇప్పుడు గాలికి వదిలేశారని ఇంటర్వ్యూలలో పాల్గొన్న వారంతా ఏకగ్రీవంగా చెప్పారు. కోర్టు కేసుల్లో 'మీ చావు మీరు చావండి' అంటూ వదిలేశారని అనేక మంది ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు, ప్రత్యక్షంగా దాడులలో పాల్గొన్న కింది కులాల వాళ్లు పేదరికంలో ఉన్నారని, తాను సందర్శించిన అన్ని కుటుంబాల పరిస్థితి ఒకేలాగా ఉందని రాకేష్ శర్మ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు కల్పించిన కుట్రదారులపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారని తన చిత్రంలో పొందుపరిచిన ఇంటర్వ్యూ వీడియోల ద్వారా మనకు స్పష్టం చేస్తున్నారు.

2006 నుంచి నాలుగు డాక్యుమెంటరీలను నిర్మించారు. ముంబయ్ థియేటర్‌లో ప్రివ్యూకు బాలీవుడ్‌లో అనేక మంది నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు హాజరై వీక్షించారు. సినిమా పూర్తి కావడానికి అరగంట ముందు థియేటరులో కొంతమంది పదేపదే జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారని శర్మ తెలిపారు. తన సినిమా పూర్తి వాస్తవాల ఆధారంగా నిర్మించింది కావడంతో విడుదలకు ఆటంకాలుండవని భావించానన్నారు. అయితే ఆనాటి సెన్సార్ బోర్డు అధికారి మాధుర్ భండార్కర్ దగ్గరికి వెళితే నిరాశ ఎదురైందని, అభిప్రాయం అడిగితే ఒక్క నవ్వు నవ్వి వూరుకున్నారని శర్మ తెలిపారు.

చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే ఈ నరమేధం కరుడుగట్టిన హిందూత్వ శక్తులు రాజకీయ ప్రయోజనాల కోసమేనన్నారు. దళిత, ముస్లింవాడలలో మాత్రమే ఈ దారుణం ఎందుకు జరిగింది? సంపన్న ప్రాంతాలను ఎందుకు మినహాయించారని డాక్యుమెంటరీని వీక్షించిన అనేక మంది వ్యాఖ్యానించారు. విధ్వంసకాండ ఫలితాలను 2007, 2012లలో జరిగి అసెంబ్లీ ఎన్నికలలో వారు పొందారన్నారు..

నరేంద్ర మోడీ ముందుగానే ఆలోచించి సమగ్ర వ్యూహాన్ని రూపొందించుకున్నారా అని సందేహించడానికి సినిమా చివరిలో లోని సీన్ ఆస్కారమిస్తుంది. అహమ్మదాబాద్‌లో బీజేపీ ప్రధాన కార్యలయం వెలుపల జరిగిన సభలో తాను ఢిల్లీలో అధికార పీఠాన్ని లక్ష్యంగా చేసుకున్నానని ప్రకటించారనీ,శర్మ వ్యాఖ్యా నించారు. ముస్లింలపై దళితులను ఉసికొల్పారనీ, మోడీ, అమిత్‌షాలాంటి వారి కనుసన్నల్లో ఈ దారుణం జరిగిందన్న ఆరోపణలున్నా వీరిపై ఒక్క కేసుకూడా నిలవలేదు.

శర్మ డాక్యుమెంటరీలను నిర్మించే సమయంలోనే కవి, రచయిత జిగ్నేష్ మెవానీ ఉనా పట్టణంలో దళితులను హింసించిన ఘటనపై ముస్లింలను, దళితులను ఏకం చేసి ఉనా నుంచి అహమ్మదాబాద్‌కు పదిరోజుల పాదయాత్రకు నాయకత్వం వహించారు. ఆయన నిర్వహిస్తున్న కార్యకలాపాలపై శర్మ సంతోషం వ్యక్తం చేస్తూ, తనతో కలుపుకున్నారు. 2006, 2008లలో మాలెగాన్‌లో జరిగిన పేలుళ్లపై ప్రస్తుతం శర్మ మరో డాక్యుమెంటరీ నిర్మిస్తున్నారు.

భారతదేశం మరువలేని అత్యంత దురదృష్ట ఘటన, విద్వేష తీర్పు" అని దర్శకుడు రాహుల్ శర్మ "2002 నాటి మారణకాండను నిర్వచించారు.

---

## జన చైతన్య యాత్రలను
# విజయవంతం చేద్దాం!

ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉండి ఎమ్మెల్యే శివ

**తాళం హనుమంతరావు,ఉండి(రా.వా):** నవంబరు 1నుండి నెలాఖరు వరకు నియోజకవర్గంలో జరిగే జనచైతన్య యాత్రలను విజయవంతం చేద్దామని ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు విజ్ఞప్తి చేసారు. ఉండి ఏఎంసిలో మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్ అధ్యక్షతన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం తొలుత పార్టీ వ్యవస్థాపకులు దివంగత ఎన్టీఆర్, ఇటీవల మృతి చెందిన ఆకివీడు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ అద్యక్షులు వేటుకూరి వెంకట సుబ్బరాజులకు నివాళు లర్పించింది.ఎమ్మెల్యే శివ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ యాత్రలు జరుగుతాయన్నారు. గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం గ్రామంలో జనం సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరిద్ధామన్నారు. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పూర్తి చేద్ధామన్నారు.త్వరలో ముఖ్యమంత్రి ఉండి నియోజకవర్గంలో త్వరలో పర్యటిస్తారని ఎమ్మెల్యేచెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం ఖరారు కాకముందే సన్నాహాలు పూర్తి చేద్ధామన్నారు. ఎన్నార్పి అగ్రహారంలో హెలికాప్టర్ దిగి ఆగ్రామంలో రోడ్లను ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వ ఐటిఐలో ప్రొడక్షన్ సెంటరు హాలుకు శంకుస్ధాపన చేస్తారని, కెవికె, ఎఫ్ఆర్‌సి సెంటర్లలో సిల్ డెవలప్‌మెంట్ సెంటరును ప్రారంభించి, రూ4కోట్లతో నిర్మించే ఆక్వా రిసెర్చి సెంటరుకు శంకుస్ధాపన చేస్తారన్నారు. ఆకివీడులో అండర్ డ్రైనేజ్‌కు శంకుస్ధాపన చేసి, అనంతరం యార్డులో నిర్మించిన గోదాంను, కాటన్ పార్కును, ఆక్వా ల్యాబ్‌లను సిఎం ప్రారంభిస్తారని అన్నారు. రైతులకు ఉపకరాలను పంపిణీ అనంతరం సిఎం ప్రసంగిస్తారని, ఈసభలోనే నూరు శాతం ఐఎస్ఎల్స్ పూర్తి చేసినందున ఆదర్శ నియోజకవర్గంగా సిఎం ప్రకటిస్తారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంలో శక్తివంచన లేకుండా అంకితభావంతో పనిచేసి సత్తా చూపిన దాతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉద్యోగులను ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండల పార్టీ అద్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, ఉండి, ఆకివీడు ఏఎంసిల చైర్మన్లు గోపాలకృష్ణరాజు, మోటుపల్లి వర ప్రసాదు, బండారు వేణుగోపాలరావులు మాట్లాడుతూ జన చైతన్చ యాత్రల షెడ్యూలును ప్రకటించారు. సమావేశంలో భూపతిరాజు తిమ్మరాజు, ఎంపిపిలు దలియ లక్ష్మి, ఆరేటి తాతపండు, నేతల బేబి, సత్యనారాయణరాజు, రూత్‌కళ, సుజాత, రూప్‌కుమార్‌వర్మ, గేదల జాన్, కట్టా గంగాధరరావు, కాగిత బుజ్జి, కోమటి బాబులు, మోపిదేవి శ్రీనివాస్, కునుకు శ్రీనివాస్, ముదునూరి కృష్ణరాజు, సాయిరాజు, చంటిరాజు, సాంభశివరాజు, తోట ఏడుకొండలు తదితరులు మాట్లాడారు.

### తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం!

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలదే అని వారే పార్టీకి బలం అని ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆయన యండగండిలో ఇటీవల మృతి చెందిన ఇందుకూరి రంగరాజు(మాష్టారు)కు సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ముందుగా రంగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే శివ వెంట మండల పార్టీ అద్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, ఉండి ఏఎంసి చైర్మన్ కొత్తపల్లి గోపాల కృష్ణరాజు, ఉండి ఎంపిపి దలియ లక్ష్మి, పార్టీ నాయకులు ఇందుకూరి సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.

---

# శ్రీదేవి ఉత్సవకమిటీ సేవాకార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

- హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప
- అమరావతి నిర్మాణానికి శ్రీదేవి ఉత్సక కమిటీ రూ.1,11,116 విరాళం

**రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జిఎన్.రావ్ :** శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సాంస్కృతిక, సాహిత్య, విద్య, సేవా రంగాల్లో సేవలందిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబును హోంమంత్రి అభినందించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన స్ధానిక శ్రీదేవి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో జరిగిన సన్మాన సభకు హోంమంత్రి చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హోంమంత్రి చినరాజప్పను ఘనంగా సన్మానించారు. 108 సువర్ణ పుష్పాలతో ఆశీర్వచనం చేశారు. ఆలయ పండితుడు పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రిని స్వర్ణసింహతలాటంతో మంత్రి సత్కరించారు. అనంతరం అమరావతి రాజధాని నిర్మాణానికి ముఖ్యమంత్రికి రూ.1,11,116 శ్రీదేవి ఉత్సవ కమిటీ హోంమంత్రికి అందజేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, వైఎస్‌చైర్మన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, కౌన్సిలర్లు వెలిగట్ల రామలక్ష్మణరావు, యక్కల సాయిలక్ష్మి, అడిషినల్ ఎస్పి రెడ్డి గంగాధరరావు, ఆర్డీవొ జి.గణేష్‌కుమార్, డిఎస్పి ఎల్.అంకయ్య, మాజి ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి, పట్టణ సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

---

# బాధితునికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**రాజధాని ప్రతినిధి ,(తుళ్ళూరు) :** మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న రోగికి ముఖ్యమంత్రి సహాయనిధినుంచి మంజూరైన రూ.1.61 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ నేలపాడు గ్రామానికి చెందిన బాధితుడు కనతరపు వీరబాబుకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి పద్మలత , తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లం కొండ నరసింహారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, తుళ్ళూరు ఎంపీటీసీ జొన్నకూటి ఏడుకొండలు, నేలపాడు సర్పంచి ధనేకుల సుబ్బారావు పాల్గొన్నారు.




బాధితునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు

---

# అభివృద్ధి పధకాల అమలుకు చిత్త శుద్ధి అవసరం

**దాసరి ఆళ్వార స్వామి**



ఉద్యాన శాఖ పరిధిలోని కూరగాయలు, పండ్లు, అయిల్‌ఫామ్ లాంటివి సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర లభించి, సాగు లాభసాటిగా మారే అవకాశము కనుచూపు దూరంలో కనిపిస్తున్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టింది. గత రెండేళ్ళలో ఉద్యాన పంటల ద్వారా ప్రభుత్వానికి కోట్లది రూపాయలు ఆదాయం సమకూర్చి. జి.డి.పి. గణనీయంగా పెరగటానికి కారణమవటంతో, వాటి ఉత్పత్తిని మరింత పెంచి ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూర్చవచ్చని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది ప్రభుత్వ ఆలోచన విధానాన్ని అనుసరించడం వల్ల రైతులకు కూడా లాభం చేకూరే అవకాశం వుంది. కూరగాయలు, పండ్లుకు లాభసాటి ధరలు లభించాలంటే రైతు పరిధిలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసివుంటుంది. అందుకవసరమైన ప్రణాళికను రైతుల ముందుంచే అధికారులు నిర్లక్షంగా వ్యవహరించితే, ప్రభుత్వం ఆశయం దెబ్బతింటుంది. ఆదాయంలో కోత ఏర్పడుతుంది. సాగుదారులకు నష్టాలే మిగిలి "ఎక్కడ వేసిన గొంగలి అక్కడే" అన్నట్లు గతం పునరావృత మౌతూనేవుంటుంది.రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షాన నిలిచి వ్యవసాయం గిట్టు బాటుగా మార్చే కార్యక్రమం చేపట్టడానికి కూరగాయలు, పండ్ల నుంచి అధికాదాయం రావటమే కారణం, ఉద్యాన పంటల వల్ల 2015-16లో రూ. 28,739 కోట్లు ఆదాయం సమకూరింది. 2016-17లో అది రూ.33,389కోట్లకు పెరగవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తుంది. సాదారణ కూరగాయలైన టమాటాలు రూ.2,404 కోట్లు, వంకాయలు రూ.636 కోట్లు, బెండకాయలు రూ.370 కోట్లు విలువైన పంటలు పండించటం లక్ష్యంగా పెట్టుకొంది ప్రభుత్వం. వీటి వలనే మిగిలిన ఉద్యాన పంటల లక్ష్యాలను కూడా ప్రభుత్వం నిర్ధేశించింది. పండ్ల ఉత్పత్తిని గణనీయంగా పెంచటంకోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేసింది. మామిడి సరాసరి దిగుబడి హెక్టారుకు 9టన్నులు. దాన్ని కనీసం 11 టన్నులకు పెంచాలని ప్రభుత్వం నిర్ధేశిస్తుంది. దానిమ్మ దిగుబడి హెక్టర్‌కు 10టన్నుల మాత్రమే దాన్ని 15 టన్నులకు పెంచాలన్నది ప్రభుత్వం సంకల్పం. బొప్పాయి హెక్టరుకు 80 టన్నుల వరకు వస్తుంది. దాన్ని 100 టన్నులకు పెంచాలన్నది ప్రభుత్వ ధ్యేయం. దిగుబడి పెంపకం విషయంలో ప్రతి రైతు గుర్తుంచు కోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. వాటిని అమలు చేయించవలసిన భాద్యత ఉద్యాన శాఖాధికారులు సిబ్బందిదే. వారు ఏ కొంచెం ఆలస్యంగా వ్యవహరిస్తే దిగుబడి నాణ్యత "యథా రాజా - తదా ప్రజ" అన్నట్లు తయారవుతుంది. ఇక్కడ ఉత్పత్తులు ఇక్కడ వినియోగానికే పరిమితం కాదన్న విషయం సంబంధిత అధికారులు , రైతులు కూడా గుర్తుంచుకోవాలి. ఈ ఉత్పత్తులను దేశమంతా గుర్తింపు పొందిన కార్పొరేట్ సంస్థలకు యివ్వటానికి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విదేశాలకు కూరగాయలు, క్యాబేజి జాతి ఆకు కూరలను ' లారెన్స్ డేల్ ఆగ్రో ప్రాసింగ్ ఇండియాకు ' ప్రభుత్వం అందించబోతుంది. అలాగే సాధారణ కూరగాయలను వాల్‌మార్ట్ సంస్థకు అందజేయనుంది. మిరపను 'బేయర్‌క్రాఫ్ సైన్సు' నేషనల్ కొతటరల్ మేనేజ్‌మెంటు సర్వీస్‌కు అందిస్తుంది. మామిడి, ఆరెంజ్, పామాయిల్, బంగాళ దుంపలను పెప్సికో ఇండస్ట్రీకి, అరటి, దానిమ్మ పండ్లను, ప్యూచర్‌గ్రూప్‌కి పంపుతుంది. మామిడి,టమాటాలను 'జైన్ ఇరిగేషన్' సంస్థకు సరఫరా చేస్తుంది. దేశంలో గుర్తింపుపొందిన ఈసంస్థలు మంచిధర చెల్లించటానికి వెనకాడవన్న విషయాలు నగ్నసత్యమే. అదేసమయంలో నాణ్యత విషయంలో కూడా అవి నిక్కచ్చిగా వ్యవహరిస్తాయి. నాణ్యత ప్రమాణాలలో ఏకొంచెం తేడా వచ్చినా సరుకులను నిర్ధ్వంధంగానిరాకరిస్తాయి. అది ప్రభుత్వనికి తలవంపులవుతుంది. కాబట్టి నాణ్యత విషయంలో రైతులు, సంబంధిత అధికారులుకూడా చిత్తశుద్ధితో వ్యవహరించినపుడే ప్రభుత్వాశయం నెరవేరుతుంది. రైతుకి గిట్టుబాటుధర లభిస్తుంది. నాణ్యత విషయంలో తల వంపులకు గురైన సంఘటనలు గతంలో అనేకం వున్నాయి. మన మామిడికి విదేశాల్లో మంచిగిరాకి వుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మామిడి నాణ్యత ప్రమాణలను ధీటుగా లేదన్న కారణంగా గత కొన్నిఏళ్ళుగా కొన్ని దేశాలు మన మామిడి దిగుమతిపై నిషేధం విధించాయి. నాణ్యమైన మామిడి కాయలను కొన్న విదేశీ నిపుణులు ఆంధ్ర వచ్చి తిరుపతి, విజయవాడ లాంటి నగరాలలో తిష్ట వేసి నాణ్యతగల తోటలను ఎంపిక చేసుకొని అధిక ధర చెల్లించి వాటిని తమ దేశంకు తీసుకుపోతున్నారు. మన దేశం నుంచి ఎగుమతిఅయ్యే పొగాకులో ఆంధ్రప్రదేశ్ ది 90 శాతం. మన దేశం నుంచి విదేశాలను పంపిన పొగాకు బేళ్ళు తిరిగి వచ్చిన ఘనత కూడ మన వారిదే. అలాగే గుంటూరు మిర్చికి ఇతరదేశాల్లో మంచి పేరుంది.అలాంటి మిర్చి బేళ్ళుకూడా తిరిగి వచ్చేశాయి. అంతే కాకుండా సముద్ర ఉత్పత్తులైన రొయ్యలు ప్రధానమైనవి వాటికి నాణ్యత లోపం జాఢ్యం అంటుకొంది. మన దేశం నుంచి వెళ్ళిన రొయ్యలు నాణ్యతలోపం కారణంగా తిప్పి పంపిన సంఘటన మన రొయ్యల పెంపకందార్లు, ఎగుమతి దారులు మర్చి పోలేదు.

గతంలో ఎగుమతులు, నిరాకరణలు వ్యక్తులు, సంస్థలకే పరిమితం. వాటి విషయంలో ప్రభుత్వం ప్రమేయం నామమాత్రమే . ఇక పై ప్రభుత్వం చేపట్టబోయే ఈ పథకంలో పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. రైతు వల్ల పొరపాటు జరిగినా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా దాని మంచి,చెడులు ప్రభుత్వానికే ఆపాదించబడతాయి. లాభాలు వస్తే రైతులను చేరతాయి. ఒప్పందం కుదుర్చుకుంటున్న సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలు కొన సాగాలన్నా, మన ఉత్పత్తులపై ఆయాసంస్థలకు సదభి ప్రాయం ఏర్పడాలన్నా. సంబందిత అధికారులు చిత్త శుద్ధిలో వ్యవహరించాలి. రైతు తప్పుగా వ్యవహరిస్తున్నడని అధికారికి అనుమానం వచ్చినా అతనిపై చర్యతీసుకోవడం, లేదాపై అధికారులకు తెలియజేయటం సిబ్బంది ప్రధానబాధ్యత. దిగుబడులు గణనీయంగా పెంచటానికి ప్రతిరైతు ఆశపడతాడు ఆరాటపడతాడు.అందుకు అతను చేపట్టే మొట్టమొదటి చర్య అధిక నత్రజని ఎరువులు వాడటం. నత్రజని ఎరువులను అధికమోతాధులో వాడి పెంచిన ప్రతిపైరు కంటికింపుగా కనబడుతుంది.అదే మొతాదులో చీడ పీడలకు ఆహ్వానం పలుకుతోంది, ఏపైరు సాగు దారైనా ఒక్క విషయం స్వాను భవంతో తెలుసుకొని పంట ఏదైనా కావచ్చు. ప్రదేశం ఏదైనా కావచ్చు. కాలం ఏదైనా కావచ్చు తాను విత్తనం వేసే భూమిని మూడు భాగలుగా విభజించండి. ఒక భాగంలో నత్రజని ఎరువులు వాడకుండా సేంద్రియసాగు చేయండి. రెండవ భాగంలో సిఫారుసు మేరకు నత్రజని ఎరువులు వాడండి.మూడవ భాగంలో రైతు కోరిన ప్రకారం అధికనత్రజని ఎరువులు వేయండి. మొదటి భాగంలో చీడ పీడలు ఆశించవు కాని దిగుబది తగ్గడు. మంచి ధర వస్తుంది. రెండవ భాగంలో సాధారణ దిగుబడి వస్తుంది. సాధారణ ధరలభిస్తుంది. నత్రజని ఎరువులనిఅధికంగావాడిన భాగంలో పైరుబాగుంటుంది.కాని అదే మోతాదులో చీడ-పీడలు విజృంచిస్తాయి. వాటిని అదుపుచేయటానికి పురుగుమందులకు రెటింపు ఖర్చుపెట్టాల్సివస్తుంది. ఈ మూడు భాగాల పెట్టుబడి, దిగుబడి , ఆదాయం లెక్కించండి. అప్పుడు ఎరువు ఏమేరకు వేయడం మంచిదో రైతుకు అనుభవంలో తెలుస్తుంది. ఆదిశగా రైతులను మళ్ళించాలి. నిర్ధారించిన నాణ్యతా ప్రమణాలు సమకూరుతాయి. గిట్టుబాటు ధర లభిస్తుంది. సాగు లాభదాయకంగా ఉంటుంది. ప్రభుత్వం పథకం ప్రజాపయోగమౌతుంది. ఆదిశగా రైతులు, అధికారులు ఆడుగులు వేయడం చాలా అవసరం.

---

# ఇకపై ఆరెస్సెస్ నోబెల్ ప్రైజులు

**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కు గొప్ప అవకాశం లభించింది. ఆరెస్సెస్ సాంస్కృతిక విభాగం సంస్కార్ భారతి తరపున ఏటా నోబెల్ పురస్కారాలను ప్రదానం చేయడానికి కేంద్ర సాంస్క ృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం ఆమోదం తెలిపింది. శాంతి, మానవ హక్కులు, సాహిత్యం, దృశ్య, ప్రదర్శన కళలు, సైన్స్, విద్య తదితర రంగాల్లో విశేష సేవలందించినవారికి సంస్కార్ భారతి నోబెల్ బహుమతులు ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది.'నైమిష్య సమ్మాన్' పేరుతో నోబెల్ పురస్కారాల తరహాలో వివిధ రంగాల్లో ప్రముఖులను సన్మానించాలని ఆరెస్సెస్ నిర్ణయించింది. నవంబరులో వారణాసిలో జరిగే రాష్ట్రీయ సంస్క ృతి మహోత్సవాల్లో వీటిని ప్రదానం చేస్తారు. ఈ పురస్కారాలను ప్రతి సంవత్సరం ఇస్తారు. వివిధ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో కూడిన జ్యూరీ నిర్ణయం మేరకు విజేతలను ప్రకటిస్తారు. సంస్కృతి మహోత్సవాలకు రూ.220 కోట్లు కేటాయించగా,దీనిలో రూ.70 కోట్లు పురస్కారాలకు వెచ్చిస్తారు.

విజయవాడలో ఏకైక ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్
0866 -6006999, 95810 12950, 90523 62816
IIS IQRAA International School
మా ప్రత్యేకతలు
. ఇంటారాక్టివ్ తరగతులు
. ఉత్తమ ఉపాధ్యాయులు
. అదనపు బోధనా ప్రణాళిక కార్యక్రమాలు
. వ్యక్తిగత సందేహాల విశ్లేషణ
. అధునాతన ల్యాబ్
. ఇండస్ట్రియల్ విజిట్స్
. హార్స్ రైడింగ్, స్విమ్మింగ్ (గొల్లపూడి)
. విద్యతోపాటు ప్రొజెక్టర్ సౌకర్యం
. కంప్యూటర్ శిక్షణ
. సి.బి.యస్. ఇ సిలబస్
. కంప్యూటర్ ల్యాబ్
. సైన్స్ ఎగ్జిబిషన్
. అత్యాధునిక కంప్యూటర్ తరగతులు
. ఖురాన్ కంఠస్థం
. బస్సు సౌకర్యం
. స్పోర్ప్స్ & కుంగ్‌ఫు
. గ్రూప్ డిస్కషన్స్
. స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు
ఇక్రా ఇంటర్‌నేషనల్ స్కూల్
అడ్రస్ : మజీద్-ఎ-అక్సా ఎదురుగా న్యూ సనత్ నగర్.విజయవాడ -7,
గొల్లపూడి బ్రాంచ్, విజయవాడ.

## అగ్రదేశం పరువు తీస్తున్న

# అధ్యక్ష ఎన్నికల ప్రచారం



అమెరికా అధ్యక్ష ఎన్నికల కోసం చేస్తున్న ప్రచారం ఇంతకుముందెన్నడూ లేని విధంగా ఆ దేశపు పరువుతీస్తోంది. రిజబ్లికన్ పార్టీ తరపున డోనాల్డ్ ట్రంప్, డెమాక్రటిక్ అభ్యర్థిగా హిల్లరీ క్లింటన్ పోటీ చేస్తూ, ప్రచారంలో వ్యక్తిగత నిందారోపణలకు దిగుతున్న వైనం ప్రపంచ దేశాలను నివ్వెరపోయేట్లు చేస్తోంది. నవంబరు 8న జరగనున్న ఈ ఎన్నికల కోసం ఇద్దరు అభ్యర్థులు బాహాబాహీకి తలపడుతున్నారు. ఎన్నికల చర్చల్లో భాగంగా మూడు సార్లు వారు ప్రజలమధ్య వారి ఎన్నికల వాగ్దానాలను, ప్రపంచ దేశాల పట్ల తమ వైఖరిని, దేశం ఎదుర్కొంటున్న దారిద్ర్యం, నిరుద్యోగం,ఆర్థిక మాంద్యం, ప్రపంచ రాజకీయాల్లో రోజురోజుకూ కోల్పోతున్న ప్రాభవం వంటి ప్రధాన అంశాల గురించి ప్రస్తావించాలి. కాని రెండు చర్చాగోష్టుల్లోనూ అధ్యక్ష అభ్యర్థులిద్దరూ ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ పరస్పర వ్యక్తిత్వహనానికి పాల్పడుతున్న తీరు ప్రజాస్వామ్యానికి చేటు తెచ్చేలా ఉంది. వీరి తీరు ప్రజాస్వామ్య హితైషులకు తీవ్ర వేదన, ఆగ్రహం కలిగిస్తోంది. ఇలా ఒకరిపై ఒకరు నిందారోపణలకు దిగటం అమెరికన్లను అవమానించడమే...దేశానికి కాబోయే అధ్యక్షుడు జాతీయ, అంతర్జాతీయంగా కీలక సమస్యలు,అంశాలపై ఎలాంటి వైఖరి కలిగి ఉన్నరనేది ఈ చర్చల ద్వారా దేశ ప్రజలకు అర్థం కావాలి. పస్తుతం ప్రతి ఇద్దరు అమెరికన్లలో ఒకరు దారిద్ర్యంలో ముగ్గడమో పేదరికపు అంచుల్లోకి నెట్టబడటమో కొనసాగుతోంది. నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతోంది. ఆరోగ్య సంరక్షణకయ్యే వ్యయం సామాన్యులు భరించలేనంతగా ఉంది. నల్లజాతి వారిపై వివక్షత కొనసాగుతోంది. తుపాకీ సంస్కృతి పౌరులను భయంకంపితులను చేస్తోంది. అయితే వీటిపై అసలు చర్చే జరగలేదు. ట్రంప్‌కు మహిళలపట్ల ఉన్న చులకన భావం, అవినీతిలో కూరుకుపోయిన హిల్లరీలతో ఎవరికి ఓటేయ్యాలో తెలియని పరిస్థితుల్లో అమెరికా ప్రజలున్నారు. ఆడవారిపట్ల, ఆఖరికి తన సొంతకూతురిపట్ల గౌరవాభిమానాలు లేకుండా మాట్లాడిన వ్యక్తిగత వీడియోలు అమెరికా ప్రజలను నివ్వెర పరిచాయి.

ఎప్పటికప్పుడు మహిళా బాధితులు పెరుగుతుండటం రిపబ్లిక్ పార్టీని ఇరకాటంలో పెడుతుండగా, అధికారిక మెయిళ్లన్నీ వ్యక్తిగత ఖాతాలోకెళ్లటం, చైనా ఉత్తరకొరియాకు సహాయం నిలిపివేయకపోతే దాన్ని అణ్వాయుధాలతో రౌండప్ చేస్తాననడం లాంటి రహస్య చర్చలను వికీలీక్స్ బహిరంగ పర్చడం హిల్లరీ క్లింటన్‌కు అడ్డంకిగా మారాయి. నిన్నటివరకు ముస్లింలకు చోటులేదు,ఉద్యోగాలన్నీ అమెరికన్లకే విదేశీయులను తరిమేస్తాం, అంటూ తెలంగాణ ముఖ్యమంత్రిని తలపించిన ట్రంప్ వ్యాఖ్యలు , ఆదివారం బాలీవుడ్ నటులతో జరిగిన గానాబజానాలో హిందువులంటే చాలా ఇష్టమని చెప్పడం ట్రంప్ మాటనిలకడలేనిదానికి మచ్చుతునక.

ఆకలిలేని,యుద్ధ మేఘాలు అలుముకోని, అసమానతలు, వివక్ష,నిరాశానిస్పృహలు లేని, హింసకు,ఘర్షణలకు అస్కారంలేని సమాజం, ఆర్థిక మాంద్యం,నిరుద్యోగం, జాతివివక్ష, ఇతర అసమానతలు లాంటి తీవ్ర సమస్యలు ఎలా పరిష్కారిస్తారో చర్చాగోష్ఠుల్లో వివరిస్తారని అమెరికన్లు ఆశించారు. కానీ వారి ఆశలు అడియాసలే అయ్యాయి. అయితే చర్చ సందర్భంగా అభ్యర్థులిద్దరూ తమ తప్పులను ఒప్పుకోవడం కొసమె రుపు. నేరాలకూ, పెద్ద తప్పిదాలకూ పాల్పడిన వారిని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టాల్సిన దుస్థితి ఈ ఎన్నికల్లో అమెరికన్లకు అనివార్యమైంది. చివరి చర్చా కార్యక్రమం ఈనెల 19న లాస్‌వెగాస్‌లో జరగనుంది.

ఇప్పటి వరకు కీలక అంశాలపై అభ్యర్థులిద్దరూ చేసిన ప్రస్తావనలు వారి తిరోగమన వైఖరిని పట్టించాయి. ట్రంప్ ప్రస్తావించిన ఆర్థిక అంశాలు అమెరికాకు హాని చేసేవిగానే ఉన్నాయి. ఆయన జాత్యహంకార వ్యాఖ్యలను బట్టి అమెరికాలో అసహనం పెచ్చుమీరుతుందనే ఆందోళన కలిగిస్తోంది. హిల్లరీ క్లింటన్ తన ప్రచారంలో రష్యా వ్యతిరేక వాగ్బాణాన్ని ప్రదర్శిస్తున్నారు. ట్రంప్ రష్యా ఏజెంటుగా పేర్కొంటూ దాడి చేశారు. ఆమె చేస్తున్న రష్యా వ్యతిరేక ప్రచారం... భవిష్యత్తులో అమెరికా-రష్యాల సంబంధాలను వదిలి మరింత క్షీణింపచేస్తాయనడంలో సందేహంలేదు. ఆ విధంగా రష్యాతో కలహాన్ని పెంచటం వల్ల తనకు మద్దతునిస్తున్న యుద్ధ పరిశ్రమ లాభపడేలా చేయటం హిల్లరీ రాజకీయాల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కాగా, ఇద్దరు అభ్యర్థులూ.. అమెరికా సైనిక జోక్యాలకు మద్దతునివ్వటానికి పోటీ పడడం, పశ్చిమాసియాపై అనుసరిస్తున్న పరిష్కారాల మార్గాలపై వ్యతిరేకత వ్యక్తంచేయకపోవడం విశేషం. వాణిజ్య, ఆర్థిక రంగాల్లో, అంతర్జాతీయ అంశాల్లో ఇద్దరు అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు, విధానాలు వర్ధమాన దేశాలకు హానికరంగా తయారుకానున్నాయి.

## గంగా - యమున ప్రత్యేక రైలు

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** విజయవాడ నుంచి ఉత్తరాది ప్రముఖ క్షేత్రాలకు ఐఆర్‌సిటిసి ప్రత్యేక రైలు ఈ నెల 25న విజయవాడ, నుంచి బయలుదేరుతుంది. గయా, వారణాశి, అలహాబాద్, మధుర, ఢిల్లీ, ఆగ్రల మీదుగా ఈరైలు ప్రయాణిస్తుంది. తిరిగి నవంబరు 5న విజయవాబ చేరుకుంటుంది. భోజనం, వసతితో కలిపి స్లీపర్‌క్లాస్‌లో రూ.10,035, ఎసి 3వ తరగతిలో రూ.13,940 చార్జీలుగా వసూలు చేస్తారు.


డెవలప్‌మెంట్ కోసం
రాజధాని అమరావతి ప్రాంతంలో
డెవలప్‌మెంట్ కోసం భూమి కావాలన్నా
లేక భూమి ఇవ్వాలన్నా
సంప్రదించండి
96768 44442


# ఉగ్రభూతంపై ఉక్కుపాదం



బ్రిక్స్ దేశాల నాయకులు, నాయకులను ఆకర్షించిన సైకత శిల్పాలు (ఎడమ) సుదర్శన్ పట్నాయక్

**బెనాలిమ్ (గోవా) :** ప్రపంచంలో ప్రతి మూలా ఏదో ఒక మూల ఉగ్రదాడులు జరుగుతూనే ఉండటంతో బ్రిక్స్ దేశాలన్నీ ఉగ్రభూతంపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించుకున్నాయి. ఉగ్ర ముప్పును ఎదుర్కొవడంపై భద్రతా సహకారం పెంపు ప్రధాన అజెండాగా బ్రిక్స్ సదస్సు జరిగింది. పాకిస్తాన్ కేంద్రంగా ఉగ్రవాదుల నుంచి పొంచి ఉన్న ముప్పును భారత్ బ్రిక్స్ దేశాలముందుంచింది. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి అంతర్జాతీయ సమ్మిళిత ఒడంబడికి విషయమై ఒత్తిడి తీసుకురానున్నది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా, బ్రెజిల్ అధ్యక్షుడు మైకేల్ టోమర్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలు సదస్సుకు హాజరయ్యారు. పాక్ ఉగ్రవాదులు యూరీ దాడికి పాల్పడిన వారాలలోపే జరుగుతున్న ఈ సదస్సులో సాయుధులైన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై చర్యలతో సహా ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు నిరంతర చర్యలు చేపట్టాల్సిన భారత్ పునరుద్ఘాటించనుంది. పుతిన్, జిన్‌పింగ్‌లతో ప్రధాన మంత్రి మోడీ ఇప్పటికే ద్వైపాక్షిన చర్చలు లేదా ప్రపంచంలో సగం జనాభాకు ఈ ఐదు బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ దేశాల జాతీయ స్థూల ఆదాయం 16.6 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇదిలాఉండగా అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమ్మిళిత ఒడంబడిక (సీసీఐటీ) విషయంలో ఐక్యరాజ్యసమితి వద్ద నెలకొన్న జాప్యాన్ని తొలగించేందుకు బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా)లను ఏకతాటిపై తీసుకువచ్చేందుకు బ్రిక్స్ వేదికగా భారత్ ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది. బ్రిక్స్-బిమ్‌స్టిక్‌కు మయన్మార్‌ర్ (దేశ రాయబారి), థాయ్‌లాండ్, శ్రీలంక, నేపాల్, బాంగ్లాదేశ్, భూటాన్ ప్రధాన మంత్రులు హాజరయ్యారు. సభ్య దేశాల నుంచి హాజరైన వాణిజ్య ప్రతినిధుల సమావేశం తర్వాత నాయకుల మధ్య పరిమిత చర్చల నేపథ్యంలో ఒక గ్రూప్ ఫొటోతో సదస్సు ప్రారంభమవుతుంది. రెండో సమావేశంలో నాయకుల ప్రసంగం అనంతరం సదస్సు ముగుస్తుంది. బంగాళాఖాతం పరిసర దేశాలమధ్య బహుళ రంగాల ఆర్థిక సహకారం (బిమ్‌స్టిక్) పునరుద్ధరణ చొరవ విషయంలో భారత్ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. దీనిపై భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక థాయ్‌లాండ్ ప్రధాన మంత్రులు, మయన్మార్ (రాయబారి) ఒక అవగాహనకు రానున్నారు.

### బ్రిక్స్ నిర్ణయం

పర్యావరణ నిర్వహణ, సరిహద్దు ఉగ్రవాదంపై పాకిస్తాన్ ఆతిథ్యంగా జరగాల్సిన సమావేశం నుంచి భారత్‌తోపాటు మరో నాలుగు దేశాలు వైదొలిగిన విషయం తెలిసిందే. దీంతో ఇటీవల సార్క్ సదస్సులో ఈ అంశాన్నీ చర్యకు రాకుండా పోయాయి. అలాగే క్రీడలు, విద్య, సాంస్కృతిక సంబంధాలు, పర్యాటక, ఆర్థిక రంగాల్లో సహకారంతో సహా అనేక కీలక అంశాలు ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి. ఈ మేరకు ఆయా రంగాల్లో సహకారంపై మూడు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ)లు జరగనున్నాయి. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య అడ్డంకులు తొలగించేందుకు ఈ ఒప్పందాలు దోహదపడనున్నాయి. ప్రధానమైన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలతోపాటు ఆఫ్ఘనిస్తాన్, సిరియా, సూడాన్‌ల్లో భద్రతా పరిస్థితులను కూడా నాయకులు చర్చించారు.

# భారత్‌లో 2లక్షల కుబేరులు

**న్యూఢిల్లీ :** భారత్‌లో కుబేరులు (హై నెట్‌వర్త్ ఇండివిద్యువల్స్ - హెచ్‌ఎన్‌డబ్లుఐ) మరింతగా పెరిగారు. 2014 సంవత్సరంలో న దేశంలో 1.8 లక్షల మంది సంపన్నులుండగా....2015లో వీరి సంఖ్య 2 లక్షలకు చేరుకుంది. ఇదే కాలంలో వీరి సంపద1.6 శాతం మేర పెరిగి 79,700 కోట్ల డాటర్లకు చేరుకుందని క్యాప్‌జెమినీ నివేదిక వెల్లడించింది. దీంతో ఆసియా పసిఫిక్ రీజియన్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఆసియా పసిఫిక్‌లో సంపన్నులు అధికంగా ఉన్న దేశాల్లో జపాన్ మొదటి స్థానంలో ఉంది. ఈ దేశంలో 27 లక్షలకు పైగా కుబేరులున్నారు. 10 లక్షలకు పైగా సంపన్నులతో చైనా తర్వాతి స్థానంలో ఉంది. జపాన్‌లోని హెచ్‌ఎన్‌డబ్లూఐల సంపద 11.4 శాతం పెరిగి 6,57,100 కోట్ల డాలర్లకు చేరుకోగా.... చైనాలోని వారి సంపద 16.9 శాతం పెరిగి 5,26,100 కోట్ల డాలర్లు చేరింది. ప్రపంచంలో అధిక సంపద కలిగిన హెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు ఆసియా పసిఫిక్ రీజియన్‌లోనే ఉండటం విశేషం.గత ఏడాదిలో వీరి సంపద 9.9 శాతం పెరిగి 17.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇదేకాలంలో మిగతా ప్రపంచంలోని హెచ్‌ఎన్‌డబ్ల్యూఐల సంపద 1.7 శాతం పెరిగితే ఆసియా పసిఫిక్ మాత్రం 5.8 రెట్లు పెరగడం విశేషం.

## కార్పోరేషన్ రుణాలకు గడువు పొడిగింపు

**రాజధాని, ప్రతినిధి - తుళ్ళూరు :** వివిధ కార్పోరేషన్‌ల ద్వారా రుణాలను పొందేందుకు గడువును ప్రభుత్వం పెంచింది. ఎస్.సి, ఎస్.టి, బి.సి, తదితర కార్పోరేషన్‌ల ద్వారా రుణాలను పొందేందుకు ప్రభుత్వం మొదట గడువును ఈ నెల 18 వ తేదిగా నిర్ణయించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ప్రభుత్వం రుణాలను పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వ తేది వరకు గడువును పొడిగించింది.






విలేకర్లు , అడ్వర్‌టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలోని రాయపూడి నుంచి వెలువడుతున్న 'రాజధాని వార్తలు' తొలి తెలుగు మల్టీకలర్ వారపత్రికకు అడ్వర్‌టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను.
వివరములకు సంప్రదించగలరు.
రాజధాని వార్తలు
E- mail : info@rajadhanivartalu.com
www.rajadhanivartalu.com
FB: facebook.com/rajadhaniv
cell
94406 62699,
96768 44442











## మాల్యా విల్లా కొనండి బాబూ....

### బ్యాంకుల వేడుకోలు

**ముంబై:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 17 బ్యాంకుల కన్సార్టియానికి మరోసారి చేదు అనుభవం ఎదురైంది. బ్యాంకులకు రూ.9 వేల కోట్ల రూపాయలు నామం పెట్టి విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా కింగ్‌ఫిషర్ విల్లాను కొనేందుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. గోవాలోని ఈ విల్లాను బ్యాంకుల కన్సార్టియం వేలానికి పెట్టింది. దీని కనీసం ధరను రూ.85.29 కోట్లుగా నిర్ణయించింది. ఇ-వేలం ద్వారా బిడ్డర్లను ఆహ్వానించింది. ఇందుకు అవసరమైన ప్రకటనలు కూడా చేసింది. అయితే ఇంతవరకూ ఎవరూ బిడ్ వేయడానికి ముందుకు రాలేదు.

దీంతో బుధవారంనాడు తాజా వేలాన్ని రద్దు చేసింది. గోవాలో 12,350 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న విల్లాను విజయ్ మాల్యా గతంలో విందులు, వినోదాలు, స్పెషల్ పార్టీల కోసం ఉపయోగించే వారు. ఈ విల్లాను స్వాధీనం చేసుకునేందుకు యునైటెడ్ స్పిరిట్స్‌తోటి చట్టపరమైన పోరాటం చేసిన బ్యాంకుల కన్సార్టియం ఎట్టకేలకు గత మేలో ఈ విల్లాను తమ అధీనంలోకి తెచ్చుకుంది. యునైటెడ్ బ్రేవరీస్ హెూల్డింగ్స్‌కు చెందిన ఈ విల్లాను 2010లో బ్యాంకుల కన్సార్టియంకు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కుదవ పెట్టింది.






Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18